# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janasakthionline.com

సంపుటి : 47 సంచిక : 13 విజయవాడ 5-11-2014 పేజీలు : 8 వెల : రు 5.00


లోపలి పేజీల్లో...


- ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం - గుణపాఠాలు - చంద్ర పుల్లారెడ్డి
- నరహంతకుని నికృష్టపు చావు : అమెరికన్ సామ్రాజ్యవాదపు నీచమైన కుటిలత్వం
- రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ తీర్మానాలు
- ఇండియాలో తయారీ (మేక్ ఇన్ ఇండియా) ఎవరి ప్రయోజనాల కోసం


## డీజిలు ధరల నియంత్రణ రద్దులో వంచన

**2014** ఏప్రిల్‌లో బ్యారలు 105 డాలర్లున్న ముడిచమురు ధర అక్టోబరులో దాదాపు 86 డాలర్లకు తగ్గింది. దీనినవకాశంగా తీసుకుని నరేంద్రమోడీ ప్రభుత్వం డీజిలు ధరల నియంత్రణను ఎత్తివేసింది. దీనితో డీజిలు ధర తగ్గటంతో నియంత్రణ రద్దుకు వ్యతిరేకత రాకుండా చూసుకుంది. అంతర్జాతీయ మార్కెట్టు ధరలకనుగుణంగా ఎప్పటికప్పుడు ధరలు నిర్ణయించే స్వేచ్ఛ చమురు వాణిజ్య కంపెనీలకు దఖలు పడిందని చెప్పుకుంది. ఇది నిజమేనా?

దేశంలో చమురు శుద్ధిపరిశ్రమ ఉత్పత్తి సామర్థ్యం దేశీయ అవసరాలకుమించి పెరిగినందున ముడిచమురును మాత్రమే భారత్ దిగుమతి చేసుకుంటున్నది. గత ఏడాది భారత్ 18.9 కోట్ల టన్నుల ముడిచమురును దిగుమతి చేసుకున్నది. దీనివిలువ 14,300 కోట్ల రూ॥లు. అదే ఏడాదిలో 9.37 కోట్ల టన్నుల డీజిలును ఉత్పత్తిచేసి, దేశంలో 6.83 కోట్ల టన్నులు అమ్మగా, 2.64 కోట్ల టన్నులు ఎగుమతిచేసింది. అలాగే 3.2 కోట్ల టన్నులు పెట్రోలు ఉత్పత్తిచేసి, 1.71 కోట్ల టన్నులు దేశంలో అమ్మి, 1.52 కోట్ల టన్నులు ఎగుమతి చేసింది. ఈ ఎగుమతులతో దాదాపుగా 4వేల కోట్ల డాలర్లు ఆర్జించింది. ఇతర పెట్రో ఉత్పత్తులను కూడా ఎగుమతి చేసింది.

గతంలో పెట్రోలు, డీజిలు, వంటగ్యాసు ధరలను ప్రభుత్వం నిర్ణయించేది. చమురు వాణిజ్య కంపెనీలు వినియోగదారుడికి ఏ ధరకు అమ్మాలో నిర్ణయించేది. ఈ ధరకు డీలరు కమీషను, వివిధ పన్నులు, రవాణా ఛార్జీలూ కలిపి అమ్మేవారు. పెట్రోలు ధరలపై నియంత్రణను 2010లో ఎత్తివేశారు. పెట్రోలు, డీజిలు ధరలపై నియంత్రణను ఎత్తివేయాలని 2002లో ప్రయత్నించారు గానీ కొద్దికాలానికే తిరిగి నియంత్రణ పెట్టారు.

చమురు వాణిజ్య కంపెనీలు "ఖర్చులు తిరిగి రాబట్టటం తగ్గింద"ని (అండర్ రికవరీస్) గగ్గోలు పెట్టాయి. ఈ పదాన్ని నష్టానికి పర్యాయ పదంగా వాడాయి. ఈ పాటనే కేంద్రం అందుకుని ఈ నష్టాలను తీర్చినట్లు, అందువల్ల తనపై సబ్సిడీ భారం పడినట్లు ప్రచారం చేసింది. ప్రధాన ప్రచార మాధ్యమాలన్నీ దీనికి వంతపాడాయి. ఈ ప్రచారంతో ధరల నియంత్రణకు కేంద్ర పాలకులు చర్య తీసుకున్నారు.

వాస్తవానికి ఈ అండర్ రికవరీలన్నది ఊహజనితమే. పెట్రోలు దిగుమతి చేసుకున్న ధర, పెట్రోలును ఎగుమతి చేసిన ధరల సగటును బట్టి వచ్చిన పెట్రోలు ధరతో పోల్చి తమకు కావల్సినంత ఆదాయం రాకపోవటాన్నే అండర్ రికవరీలని (ప్రచారంలో నష్టాలనీ, సబ్సిడీలనీ) అంటున్నారు. ఉదాహరణకు పై సూత్రం ప్రకారం (దానిని వాణిజ్య సమత్వం లేదా (ట్రేడ్ పారిటీ అంటారు) పెట్రోలు ధర లీటరుకు 70 రూ॥లుగా వచ్చింది. చమురు వాణిజ్య కంపెనీలు ప్రభుత్వ నిర్ణయరేటు 65 రూ. అమ్ముతున్నాయి. 5 రూ॥లను అండర్ రికవరీగా చెబుతున్నారు. అయితే ముడిచమురు మాత్రమే దిగుమతి చేసుకుంటున్నాము. కనుక ముడి చమురు ధర, దానికి శుద్ధిచేసిన ఖర్చు, రిఫైనరీకి కొంతలాభం కలిపితే పెట్రోలు వాస్తవధర దాదాపు 30 రూ॥లు వుంటుంది. 65 రూ. అమ్మకం రేటులో పన్నులు ఇతరాలు పోగా 40 రూ॥పైగా ధర వస్తుంది. అంటే 10 రూ॥వరకూ లాభం వస్తుంది.

పెట్రోలు ధర నియంత్రణ ఎత్తివేశారు గనుక గత ఏడాది పెట్రోలు ధరను ఎలా నిర్ణయించారో చూద్దాం. చమురు శుద్ధికర్మాగారాలు లీటరు పెట్రోలుకు రూ॥41.21 పై చమురు వాణిజ్య కంపెనీలకు అమ్ముతున్నాయి. అవి దానిని డీలరుకు 44 రూ॥లకు అమ్ముతున్నాయి. దీనిపై కేంద్రప్రభుత్వం విధించిన ప్రత్యేక ఎక్సైజ్ డ్యూటీ, విద్యాసెస్సు లీటరుకు రూ॥9.28పై. డీలరుకిచ్చే కమీషన్ రూ॥2.07పై. దీనిపై వాట్‌పన్ను రూ॥11.1పై. మొత్తం ధర రూ॥66.65పై (ఈ సంఖ్యలన్నీ ఢిల్లీకి వర్తించేవి. ఇతర రాష్ట్రాలలో అమ్మకం పన్ను అదనం).

అసలు ప్రశ్న ఏమిటంటే లీటరు పెట్రోలు ధర రూ॥41.21గా ఎలా నిర్ణయించారు? గత ఏడాది డాలరుతో రూపాయి మారకం విలువ సగటు 61.4గా వుంది. దిగుమతి చేసుకుంటే పెట్రోలు ధర సగటున బ్యారలుకు 104.85 డాలర్లు వుంది. దీనిని రూపాయలు, లీటర్లలోకి లెక్కిస్తే వచ్చే పెట్రోలు ధర రూ॥41.21పై. కానీ రిఫైనరీలు 20శాతం దేశంలో ఉత్పత్తిఅయిన ముడిచమురును వాడుతున్నాయి. దీనికి దిగుమతి చేసుకున్న ధరను వాడుతున్నాయి. దిగుమతి ధర అంటే మనరేవుకు చేరినప్పటి ధర. అంటే ప్రపంచ మార్కెట్లో కొన్న ధరకు రవాణా ఛార్జీలూ, లోడింగు, అన్‌లోడింగ్ ఖర్చులూ, ఇన్సూరెన్సు ఖర్చు, చివరిగా కస్టమ్సు సుంకాలూ కలుస్తాయి. దేశంలో తయారైన పెట్రోలుకు పై ఖర్చులన్నీ కలిపి అసలు ధరకన్నా ఎక్కువ ధరను నిర్ణయించారు.

ఇక పెట్రోలు సగటు ధర నిర్ణయంలోకూడా అంతర్జాతీయ మార్కెట్టులో పెట్రోలు సగటు ధరనే పేర్కొన్నారు. నిజానికి మనం దిగుమతి చేసుకునేది ముడిచమురు. దీనిలో 40శాతం వరకూ ముందు కుదుర్చుకున్న ఒప్పందం రేటు ప్రకారం సరఫరా అవుతుంది. కనుక ప్రపంచ మార్కెట్టు ఎగుడు దిగుడుల ప్రభావం దీనిపై వుండదు.

ఇలా కాకుండా, ముడిచమురు దిగుమతి ధర, శుద్ధిఖర్చులు, కొంత లాభమూ కలిపి చూస్తే పెట్రోలు ధర చాలా తక్కువుంటుంది. పెట్రోలు ధరల నియంత్రణ ఎత్తివేసిన సందర్భంలో ఫ్రంటులైన్ పత్రికలో ఒక ఆర్థిక నిపుణుడు రాసిన దానిప్రకారం, ముడిచమురు ధర బ్యారలుకు 100 డాలర్లు వుంటే డాలరుతో మారకం విలువ 48 రూ॥లుంటే లీటరు పెట్రోలు ఉత్పత్తిధర 13 రూ॥లు, డీజిలు 12 రూ. వుంటుంది. బ్యారలు ధర దాదాపు అలాగేవున్నా, మారకం విలువ పెరిగినందున లీటరు పెట్రోలు ధర 20-22 రూ॥ల మధ్యన ఎక్కువలో ఎక్కువ వుండాలి. వాణిజ్య సమత్వం పేరిట రెట్టింపు ధరకు అమ్ముతున్నారు. రెట్టింపు పన్నులు వసూలు చేసుకుంటున్నారు.

పెట్రోలు అనుభవం ఎలా వుందో ఇది తెలుపుతుంది. ఈ మేరకు పెట్రోలు ధరలు తగ్గించాలన్నది మావాదన కాదు (ఎందుకన్నది వేరే చర్చ). డీజిలు ధర నిర్ణయంలో ఎంత పెద్దభారం మోపుతారో చూపేందుకు పెట్రోలు ధరను విశ్లేషించాము. పెట్రోలు వినియోగం వ్యక్తిగత రవాణాకే పరిమితం. కాగా డీజిలు ధర పెంపకం బస్సుల, రైళ్ల ఛార్జీలనూ, సరుకు రవాణా ఖర్చులనూ నిత్యావసర సరుకుల ధరలనూ పెంచివేస్తుంది.

వాస్తవానికి డీజిలు, వంటగ్యాసు(గతంలో పెట్రోలు) ధరలు నియంత్రించినందున ముడిచమురును ఉత్పత్తిచేసిన ఒఎన్‌జిసిగానీ, చమురు శుద్ధికర్మాగారాలుగానీ, చమురు వాణిజ్య కంపెనీలుగానీ నష్టపోయింది లేదు. అండరు రికవరీలన్న ఊహాకల్పిత నష్టాలను చూపాయి. కేంద్రం కూడా నష్టపోయింది లేదు. ముడిచమురు మీద కస్టమ్సు సుంకం, ఎక్సైజ్ డ్యూటీ, సెస్సులు, అమ్మకం పన్నుల ద్వారా దానికొచ్చిన ఆదాయం, అమ్మకం ధరలో దాదాపు సగం. లేని నష్టాలను పూరించినట్లు సబ్సిడీగా పేర్కొంటున్నది.

వంటగ్యాసు ధర విషయంలోనూ ఇలాంటి వంచనే సాగుతున్నది. చమురు శుద్ధికర్మాగారాలలో ముడిచమురు శుద్ధితో పెట్రోలు, డీజిలు, కిరోసిన్, విమానాలకు ఇంధనం, నాఫ్తా, ఇంధన చమురు, లూబ్రికెంట్స్ వంటి అనేకానేక ఉత్పత్తులు వస్తాయి. వాటిలో వంటగ్యాసు కూడా ఒకటి. ఒక పరిశ్రమలో అనేక ఉత్పత్తులూ, ఉపఉత్పత్తులూ తయారవుతున్నప్పుడు ఒక్కొక్క దాని ఉత్పత్తి ఖర్చునూ నిర్ణయించేందుకు కాస్ట్ అకౌంటింగ్ పద్ధతులున్నాయి. వాటిప్రకారం వంటగ్యాసు ఉత్పత్తి ఖర్చు వాస్తవంగా తెలుస్తుంది. కానీ ప్రభుత్వం దిగుమతి చేసుకుంటే ఎంత ధర అవుతుందో దానితో పోల్చి అధిక ధరను పేర్కొని తాను చాలా తక్కువ ధరకమ్ముతున్నందున నష్టపోతున్నానంటూ వంచన చేస్తున్నది. ✸

## తుఫాను అనుభవాలను నేర్చుకోనిరాకరిస్తున్న పాలకులు

**ప్రకృతి** వైపరీత్యాలు సంభవించకుండా ఎవరమూ ఆపలేము. కానీ మానవ, భౌతిక వనరులపై దాని దుష్ప్రభావాన్ని వీలయినంత తగ్గించేందుకు తగిన సంసిద్ధతతో స్పందించగలము. ఇటీవల ఉత్తరాంధ్ర జిల్లాలను అతలాకుతలం చేసిన పెనుతుఫాను హుదూద్ ఒక విషయాన్ని స్పష్టం చేసింది. తీరప్రాంతాలకు తరచుగా తుపాను తాకిడి వున్నా వాటి అనుభవం నుండి నేర్చుకునేందుకు పాలకులు నిరాకరిస్తున్నారు.

హుదూద్ తుఫాను దక్షిణ అండమాన్ సముద్రంలో 2014 అక్టోబరు 6న పుట్టింది. అక్టోబరు 12 అర్ధరాత్రి విశాఖనగరం వద్ద తీరాన్ని దాటింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలో కొన్ని ప్రాంతాలను వినాశనానికి గురిచేసింది. హుదూద్ తుఫాను ఈ జిల్లాల్లో ఏ ఒక్కరినీ వదలిపెట్టనప్పటికీ, పేదలు, రైతాంగం, నగరంలో మురికివాడల ప్రజలకు ఎక్కువ నష్టాన్ని కలిగించింది.

కృత్రిమ ఉపగ్రహం అందించిన చిత్రాలూ, బంగాళాఖాతం తీరప్రాంత దేశాల మధ్య సమన్వయం ఫలితంగా హుదూద్ తుఫాను నడకనూ తీవ్రతనూ ఖచ్చితంగా అంచనా వేయటం సాధ్యపడింది. భారత వాతావరణశాఖ నాలుగైదు రోజులు ముందుగానే తుఫాను హెచ్చరికను అందించింది. అయినా రాష్ట్ర పాలకులు దీనికి తగినట్లు పట్టించుకోలేదు. కాగా రేడియో, టీవీలలో వచ్చిన హెచ్చరికలతోనూ, గత అనుభవాలరీత్యా ప్రజలు వేగంగా స్పందించారు. స్వచ్ఛందంగా రక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. చరాస్తులను కాపాడుకోగలిగారు. ఇళ్ళు, పంటలను రక్షించుకోవటం వారి స్వాధీనంలో లేనిది. కాగా రెండు లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించానని ప్రభుత్వం చెప్పుకున్నది అతిశయోక్తి.

సహాయం పునరావాసాలకు సంబంధించి ప్రభుత్వం చెప్పినదానికంటే చేసింది తక్కువ. 15 రోజుల తర్వాత విశాఖ నగరానికి కూడా విద్యుత్తు పునరుద్ధరణ పూర్తిస్థాయిలో జరగలేదు. గ్రామాలింకా చీకట్లోనే తడుములాడుకుంటున్నాయి. టెలిఫోను సంబంధాలు తరచూ తెగిపోతూనే ఉన్నాయి. తుఫానుకు ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధంగా లేదనటాన్నే ఇది సూచిస్తున్నది. ప్రజల, స్థానిక సంస్థల చొరవతోనే పడిపోయిన చెట్లు, చెత్తా చెదారమూ తొలగిపోయాయి.

ఈ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఒరిస్సా అనుసరించిన విధానాన్ని ఆదర్శంగా రాష్ట్ర ప్రభుత్వం చూపెడుతున్నది. ఒరిస్సా అనుసరించిన ఈ విధానంలో ప్రధానాంశాలన్నీ 1977 దివిసీమ ఉప్పెన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మాన్యువలులో ఉన్నవే. ఆనాడు వీటిని కొన్నేళ్ళు అమలుజరిపారు. తర్వాత మానివేశారు. ఈ మాన్యువల్ తుఫాను సమయంలో తీసుకోవలసిన తక్షణ రక్షణచర్యలు, తక్షణ సహాయచర్యలతోపాటుగా పునరావాస చర్యలనూ, దీర్ఘకాలిక చర్యలనూ కూడా పేర్కొంది. అంతేకాక దీనికోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని సన్నద్ధం చేసే తీరును కూడా పేర్కొంది. వీటి ఆధారంగానే 1990 చివర్లో పెనుతుఫాను వచ్చిన తర్వాత ఒరిస్సా తన తుఫాను మాన్యువల్‌ను తయారుచేసుకుంది. దీనినంతా మరుగుపర్చి ఒక ఆదర్శాన్ని యిప్పుడే కనుగొన్నట్లు ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది.

ఈ అనుభవాల నుండే తీరప్రాంత నియంత్రణా మండలి అన్న భావం పుట్టి చట్టమైంది. సి.ఆర్.జెడ్ చట్టం రాకముందు 1977 పెను ఉప్పెన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తీరప్రాంతంలో విస్తారంగా చెట్లు పెంచింది. ఇవి పూర్తిగా పెరగగానే, దోపిడీ శక్తులతో కలిసి వీటిని నరికివేసి ఖజానా నింపుకుంది. తీరప్రాంతానికి చెట్ల రక్షణ లేకుండా చేసింది. ఈ చెట్లనే కాకుండా మడఅడవులను నాశనం చేస్తున్నా పట్టనట్లు పూరుకుంది.

తర్వాత తీర నియంత్రణా మండలి చట్టాన్ని నీరుగార్చారు. దాని స్థానంలో తీర నిర్వహణా మండలి చట్టాన్ని తెచ్చారు. దీనితో వినాశకర అభివృద్ధి గలిగిన చేపల, రొయ్యల చెరువులు, థర్మల్ ప్రాజెక్టులు, కోస్టల్ కారిడార్లు పేరిట తీర నిర్వహణా మండలి చట్టాన్ని కూడా తుంగలో తొక్కారు. 2004లో సునామీ తూర్పుతీరాన్ని తాకినప్పుడు కృష్ణానదీ ముఖద్వారంలోని మడఅడవులే గ్రామాలను కాపాడాయన్న అనుభవాన్ని కూడా పట్టించుకోలేదు.

ఇక విశాఖ నగరానికివస్తే, తీరప్రాంతమంతటా మడ అడవులుండేవి. సర్వి, అనేక స్థానిక జాతులు వృక్షాలు వుండేవి. అతివేగంగా వీచేగాలుల తాకిడిని ఇవి తగ్గించేవి. బీచ్‌ల సౌందర్యీకరణతో పర్యాటకాన్ని పెంచటం, పరిశ్రమలు, సెజ్‌లు, ఐటి యూనిట్లపేరిట ఈ పచ్చదనాన్నంతా నాశనం చేశారు. మొత్తం నగరానికి తుఫాను తాకిడి భారాన్ని పెంచివేశారు.

ముఖ్యమంత్రి వారంపాటు నగరంలో బసచేయటంతో మొత్తం ప్రచారమూ, శ్రద్ధ నగరంలోనే కేంద్రీకరించబడింది. కాగా తీరని నష్టాలకు గురైన గ్రామీణ ప్రాంతాలన్నింటినీ విస్మరించారు. వరిపంట, అరటి, మామిడి, జీడిమామిడి, కొబ్బరితోటలు విశాఖ జిల్లాలో పూర్తిగా దెబ్బతినగా, మిగిలిన రెండు జిల్లాలో 30 శాతం మాత్రమే దక్కే దుస్థితిలో రైతాంగం ఉన్నారు. హుదూద్‌తో ఒరిస్సా, చత్తీస్‌ఘఢ్‌లలో పడిన వానలతో వచ్చిన వరదకు శ్రీకాకుళంజిల్లాలో వేలాది ఎకరాల పంటలు నీటమునిగాయి.

రైతాంగమెదుర్కొన్న ఈ కష్టాలను తీర్చేందుకు 15 రోజుల తర్వాత కూడా ప్రభుత్వం ఎలాంటి నిర్దిష్ట పథకంతోనూ ముందుకురాలేదు. నష్టపరిహారం అశలు చూపడం, పంటల బీమా అమలు ప్రకటనలతో సరిపుచ్చుతున్నారు.

వరుస రాష్ట్ర ప్రభుత్వాల పనితీరు చూసినప్పుడు, రైతాంగాన్ని ఆదుకునే చర్యలు చేపడతారని ఆశించలేము. 2012, 2013లో వచ్చిన నీలం, ఫైలిన్ తుఫానులకు గురైన రైతాంగానికిస్తానన్న ఇన్‌పుట్ సబ్సిడీని యింతవరకూ అందజేయలేదు. రైతాంగాన్ని దిక్కుతోచనివిధంగా తమదారి తాము చూసుకొమ్మని వదలివేస్తారు.

గత అనుభవాల నుండి నేర్చుకోవాలన్న ఆకాంక్ష ప్రభుత్వానికున్నట్లయితే, ప్రమాద హెచ్చరికలు అందిన వెంటనే కార్యరంగంలో దుమికే విధంగా తమ యంత్రాంగాన్ని సంసిద్ధపరిచే చర్యలు తీసుకోవాలి. సహాయ పునరావాస చర్యలు ఫలప్రదంగా అమలుజరపాలంటే గ్రామసభలు, వార్డుకమిటీల వంటి ప్రజాస్వామిక సంస్థలను పటిష్టపరిచి అమలుచేయాలి. ఇవి చట్టాలలో వున్నాయిగానీ ఆచరణలేవు. హుదూద్ అనుభవాలను గతంలోలాగే మళ్లీ మరచిపోరాదు. ✸

# "ఇండియాలో తయారి" (మేక్ ఇన్ ఇండియా) ఎవరి ప్రయోజనాల కోసం?

**సెప్టెంబరు** 25న వివిధ దేశాల నుండి వచ్చిన బడాబూర్జువా వర్గానికి చెందిన 500 మంది హాజరయిన ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన సమావేశంలో "ఇండియాలో తయారీ" ప్రచారాన్ని మోడీ ప్రారంభించాడు. ఈ నినాదానికి అట్టహాసంతో ప్రచారం సాగిస్తున్నారు. బడాపెట్టుబడిదారులకు "వాణిజ్య హితమైన" వాతావరణాన్ని ఏర్పాటు చేస్తానని మోడీ వాగ్దానం చేశాడు. ఈ దేశంలో ఉత్పాదక పరిశ్రమలు పెట్టి, వాటిలో తయారైన సరుకులను మిగిలిన ప్రపంచ దేశాలలో అమ్ముకొనేందుకు విదేశీ పెట్టుబడులను మోడీ ఆహ్వానించాడు. ఇక్కడ పెట్టుబడులు మదుపుపెట్టే అవకాశాలను పరిశీలించేందుకు భారత్‌లో పర్యటించమని 3వేల విదేశీ కంపెనీలకు ఆహ్వానాలు పంపాడు. మరో మాటల్లో చెప్పాలంటే భారత సహజ, మానవ వనరులను దోచుకునేందుకు ఇక్కడ సరుకులు తయారుచేసి, ఇతర దేశాలలో అమ్ముకుని లాభాలు గడించమని విదేశీ బహుళజాతి కంపెనీలను కోరాడు. దీని ద్వారా భారత్‌ను అంతర్జాతీయస్థాయి ఉత్పత్తి కేంద్రంగా రూపొందించాలని నరేంద్రమోడీ కోరుకుంటున్నాడు.

అదే సమావేశంలో కేంద్రవాణిజ్య శాఖామంత్రి "వాణిజ్యహితమైన" వాతావరణాన్ని ఏర్పాటుచెయ్యటానికి కార్మిక చట్టాలను సవరిస్తానని ప్రకటించాడు. భూసేకరణ చట్టాన్ని నీరుగార్చటమూ, వివిధ రకాల పన్నుల విధింపులో రాయితీలు యిచ్చే విధానాన్ని వాణిజ్యహితవైన వాతావరణంకోసం అప్రకటితంగానే అమలుచేస్తారు. భారత సహజ ఆర్థిక వనరులనూ, భారత కార్మికుల శ్రమశక్తినీ కారుచౌకగా కొల్లగొట్టేందుకు బహుళజాతి కంపెనీలకు అన్నిరకాల సహాయమూ చేస్తారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను, 'మొదట అభివృద్ధి ఇండియా'కు (ఇంగ్లీషులో ఈ రెండు నినాదాలలోని పదాల మొదటి అక్షరాలు ఎఫ్‌డిఐ) అన్న దానితో సమానంచేసి విదేశీ పెట్టుబడులంటే అభివృద్ధిగా చిత్రించేందుకు చేసిన ప్రయత్నం దీని నిజస్వభావాన్ని దాచలేదు.

"విదేశీ వస్తు బహిష్కరణ", "స్వదేశీ సంస్కృతి" పోషణ, "స్వదేశీ సరుకుల వినియోగం" వంటి నినాదాలతో సంఘ పరివార్ బృందం ప్రచారంచేస్తూ ప్రజలను వంచిస్తున్నది. అదే సమయంలో దాని మద్దతుతో అధికారం చెలాయిస్తున్న దాని రాజకీయ విభాగమైన బిజెపి భారత దేశాన్ని విదేశీ పెట్టుబడిదారులకూ, సామ్రాజ్యవాద దేశాలకూ లోబరిచే విధానాలను అమలు జరుపుతున్నది. "భారత్ తయారీ" అంటే స్వదేశీ నినాదంగా ప్రజలను నమ్మింప చూస్తున్నది.

ఈ పదాడంబరనినాదాలు ఎంత ఆకర్షణీయంగా కన్పించినప్పటికీ, "భారత్‌లో తయారీ" అన్న నినాదం దేశాన్నీ, ప్రజలనూ మరింత హీనపరిస్థితుల్లోకి దిగజారుస్తుందన్న వాస్తవాన్ని దాచలేదు. ఇది దేశ సార్వభౌమత్వాన్నీ, స్వావలంబనను, చివరకు నామమాత్రపు రాజకీయ స్వాతంత్ర్యాన్ని కూడా కబళించివేస్తుంది. ఇది ఏనాటికీ దేశానికీ, ప్రజలకూ సౌభాగ్యాన్ని తీసుకురాలేదు. మహాఅయితే దళారీ బూర్జువా కుటుంబాలు లబ్ధిపొందుతాయి. అదీ భారత ఆర్థికాభివృద్ధిని బలిపెట్టి!

మాకందుబాటులో వున్న సమాచారం మేరకు దేశంలో ఇప్పటికి 3254 విదేశీ బడాకంపెనీలు లాభాలు దండుకుంటున్నాయి. రాయల్టీలు సాంకేతిక పరిజ్ఞానానికి చెల్లింపులు, డివిడెండ్లు, విదేశీ ఉద్యోగులకు విదేశీ మారకద్రవ్యంలో అధికవేతనాల చెల్లింపు తదితర రూపాలలో దేశ సంపదను పీల్చివేస్తున్నాయి. 2012-13 సంవత్సరంలో ఈ బహుళజాతి కంపెనీలు తమ స్వదేశంలోని హెడ్ఆఫీసుకు పంపిన ధనం 4838 కోట్ల రూపాయలు. అలాగే డివిడెండ్ల రూపంలో తరలించిన సొమ్ము 4259 కోట్ల రూపాయలు. ఇదికాక దిగుమతి చేసిన యంత్రాలు, విడిభాగాలకు వేలకోట్లు పంపించారు. మారుతీ సుజికీ కంపెనీ 2007-08లో రాయల్టీ క్రింద రూ॥500 కోట్లు జపానుకు పంపగా, 2012-13లో రూ॥ 2500 కోట్లు పంపింది. చాలా సందర్భాలలో సాంకేతిక పరిజ్ఞానమార్పిడి జరగకుండానే రాయల్టీలు చెల్లిస్తారు. నోకియా కంపెనీ ఇలాగే చేసింది. ఇంతేకాక ఈ విదేశీ బడాకంపెనీలు భారత ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులను తప్పుడు లెక్కలు చూపి ఎగవేయటం తరచుగా జరుగుతోంది. వోడాఫోన్, నోకియా, షెల్ ఇండియా, ఐబియం తదితర కంపెనీలు చేస్తున్నదిదే. ఇవన్నీ కలిపి ఎగ్గొట్టిన పన్ను మొత్తం రూ॥ 30,000 కోట్లు. ఇది కూడా వీటికి అనేక పన్ను రాయితీలు యిచ్చిన తర్వాతే.

దేశంలోకి ప్రవాహంలా వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులతో ఉపాధికల్పన పెరుగుతుందని ప్రభుత్వం చేస్తున్న ప్రచారం సరైనది కాదు. నెలకు 10 లక్షల ఉద్యోగాలు కల్పించవలసిన పరిస్థితి నేడున్నది. కాగా సంఘటిత పరిశ్రమల రంగంలో గత పదేళ్లలో కొత్తగా ఏర్పడిన ఉపాధి 11 లక్షలు మాత్రమే. విదేశీ పెట్టుబడిదారులు తాము తయారుచేసిన సరుకులను విదేశాలలో మిగతా వారికంటే తక్కువ ధరలకు అమ్ముకోవాలి గనుక తక్కువమంది కార్మికులనుపయోగించే యాంత్రికరణను అమలుజరిపి కార్మికుల శ్రమశక్తిని అధికంగా దోపిడీ చేసుకుంటారు.

దీనికోసమే కార్మిక చట్టాలను సవరిస్తామంటున్నారు. తరచుగా కార్మికుల వేతనాలు తగ్గించటానికీ, ఎక్కువ పనిగంటలు పనిచేయించటానికీ, కారుచౌకగా మహిళల శ్రమశక్తిని రాత్రివేళల పనిచేయించి దోచుకోవటానికి అడ్డురాకుండా కార్మిక చట్టాలను సవరిస్తామని చెబుతున్నారు. ఇది రహస్యమేమీకాదు. మంత్రులు బహిరంగంగానే ఈ మాటలు చెబుతున్నారు. కాకపోతే రాత్రి షిఫ్టులలో మహిళలతో పని చేయించటాన్ని మహిళా సాధికారికత అన్న అందమైన పేరుతో అలంకరిస్తున్నారు. అయినా భారత ఆర్థిక వ్యవస్థగా చూస్తే దానికి ఒనగూడే లబ్ధిఏమీ వుండదు. దీనివల్ల విదేశీ పరిశ్రమ కొచ్చిన లాభం విదేశాలకు తరలిపోగా, శ్రామికులకు ఆదాయాలు తగ్గి వారి కొనుగోలు శక్తి క్షీణించిపోతుంది. దేశంలో సరుకులు తయారవుతున్నా అవి ప్రజల అవసరాలను తీర్చకుండా విదేశాలకే పోతాయి.

ఇప్పటికే దేశంలోని భారీ పరిశ్రమలు-ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు రెంటిలోనూ - ప్రత్యక్షంగానో, పరోక్షంగానో - విదేశీ బడాకంపెనీల ఆధీనంలోకి వెళ్లిపోయాయి. దేశంలో ఆర్థికంగా లబ్ధికలిగిస్తున్నది, ఎగుమతులు చేస్తున్నదీ, ఉపాధి కల్పిస్తున్నదీ చిన్న, మధ్యతరహా పరిశ్రమలే. భారత్‌లో తయారీ పేరిట ఉత్పాదక రంగంలోకి విదేశీ పెట్టుబడులను ప్రవహించనివ్వటం ఈ రంగాన్ని వినాశనం చేస్తుంది. ఈ రంగం 8 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తున్నది. 45 శాతం సరుకులు ఉత్పత్తి చేస్తున్నది. ఎగుమతుల్లో 40 శాతం ఈ రంగ ఉత్పత్తులదే. ఫలితంగా ఈ రంగంలో ఉపాధి క్షీణించటంతోపాటు, సంపదంతా విదేశాలకు తరలిపోతుంది.

దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ సంపాదకీయ వ్యాఖ్యను చూడండి.

"ఈ వ్యతిరేక ఫలితాలెన్ని ఉన్నప్పటికీ, విదేశీ పెట్టుబడులు వచ్చి, దేశంలో ఉత్పాదక రంగం మళ్లీ పుంజుకుని భారతీయులలో అత్యధికులెదుర్కొంటున్న నిరుద్యోగం, దారిద్ర సమస్య తీరుతాయన్న హామీ కూడా లేదు. (ఇతర అభివృద్ధిచెందుతున్న దేశాలతో) "పోటీ" పడిన మూల్యాన్ని (తక్కువ ఉపాధి, వేతనాలు దిగకోత) వారే భరించాలి. కాగా ఈ విధానంవల్ల బహుమతి అన్నది ఏదైనా వుంటే పొందేది మాత్రం కొద్దిమంది దేశీయ, విదేశీ పెట్టుబడిదారులే"(11-10-2014).

"భారత్ వస్తూత్పత్తి చేయమని బహుళజాతి కంపెనీలను ఆహ్వానించే విధానం మన పట్టణంలో పోలీసుస్టేషను పెట్టమని దొంగలను ఆహ్వానించినట్లుగానే వుంటుంద"ని పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థించే భరత్ ఝున్‌ఝున్‌వాలా వంటి ఆర్థిక నిపుణుడే వ్యాఖ్యానించవలసి వచ్చిందంటే ఆశ్చర్యం కలిగించదు. ✡

# రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ తీర్మానాలు

**2014** అక్టోబర్ 24, 25 తేదీలలో విశాఖ జిల్లా అనకాపల్లిలో రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కా॥ యస్. ఝాన్సి అధ్యక్షతన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది.

హుదూద్ తుఫాన్ విధ్వంసం ఫలితంగా రైతాంగం, ఇతరప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలను; రైతుల రుణమాఫీ, రైతాంగ ఆత్మహత్యలు తదితర అంశాలను సమావేశంలో చర్చించి, ఈ తీర్మానాలను ఆమోదించింది.

హుదూద్ తుఫాన్ కారణంగా విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 40 మంది పైగా ప్రాణాలు కోల్పోయారు. తుఫాన్‌లో మృతిచెందిన వారి కుటుంబాలకు రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గం ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసింది.

### I. ముందు జాగ్రత్త చర్యలలోనూ, బాధితులకు తక్షణ సహాయంలోనూ ప్రభుత్వ ఘోర వైఫల్యం, నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ

తుఫాన్ తదనంతరం రైతుకూలీ సంఘం రాష్ట్ర బృందం మూడు జిల్లాల్లోనూ పర్యటించి నష్టతీవ్రతను అంచనావేసింది. హుదూద్ తుఫాన్ తీవ్రత, పంటలకు, ప్రజల, ప్రభుత్వ ఆస్తులకు, రోడ్లు, రైల్వేలు, విద్యుత్తు తదితర మౌలిక సదుపాయాలకు భారీనష్టం వాటిల్లింది. పంటచేలన్నీ నీటమునిగాయి, తోటలన్నీ నాశనమయ్యాయి. వేల సంఖ్యలో పశువులు, గొర్రెలు ఇతర జీవాలు మరణించాయి. కోళ్ళ ఫారాలలో లక్షలాది కోళ్ళు మృత్యువాతపడ్డాయి. 200 కి.మీ. పైగా వేగంతో వీచిన పెనుగాలులకు లక్షలాది చెట్లు కూకటివేళ్ళతోసహా నేలకూలాయి. వేల సంఖ్యలో విద్యుత్తు స్థంభాలు నేలకొరిగాయి. మత్స్యకారుల పడవలు, వలలు ధ్వంసమయ్యాయి. ముఖ్యంగా నిరుపేదలు నివశించే పూరి గుడిసెలు, రేకుల ఇళ్ళు ఆనవాళ్ళు కోల్పోయాయి.

కొబ్బరి, అరటి, మామిడి, జీడిమామిడి, పామాయిల్, చెరకు, చింత వంటి తోటలన్నీ నేలకూలాయి. కాఫీ, సిల్వరేట్ వంటి ఉద్యానపంటలు, చోళ్ళు, మొక్కజొన్న తదితర పంటలన్నీ నాశనమయ్యాయి. కనీసం 5 సం॥ల కాలం కోలుకోలేనంతగా హుదూద్ తుఫాన్ రైతాంగాన్ని దెబ్బతీసింది.

ప్రభుత్వ యంత్రాంగాన్ని మోహరించి, ఇంతటి విపత్తు గురించి ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించటంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది.

తుఫాన్ తదనంతరం కేంద్రీకరణనంతా విశాఖపై పెడుతున్నట్లుగాఉంటూ అంతకు ఎన్నోరెట్లు బీభత్సానికి గురైన గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను పరామర్శించటంలోనూ, తక్షణ సహాయక చర్యలందించటంలోనూ ప్రభుత్వం ఘోర నిర్లక్ష్యం వహించింది.

తక్షణం ఈక్రింది డిమాండ్లు పరిష్కరించాల్సిందిగా రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) రాష్ట్రకార్యవర్గం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది.

1. హుదూద్ తుఫాన్ తీవ్రతతో సర్వం కోల్పోయిన రైతులు, వ్యవసాయ కూలీలు, మత్స్యకారులు, ఆదివాసులు, ఇతర గ్రామీణ పేదలకు ప్రథమ ప్రాధాన్యతలో సహాయం అందించాలి.
2. దెబ్బతిన్న పంటలన్నింటినీ న్యాయమైన ధర చెల్లించి ప్రభుత్వమే కొనుగోలుచేయాలి. పంటలు, తోటలు కోల్పోయిన రైతాంగానికి తగిన నష్ట పరిహారం చెల్లించాలి.
3. పోడు వ్యవసాయంలో పంటలు కోల్పోయిన ఆదివాసులకు పరిహారం చెల్లించాలి. రానున్న ఐదు సంవత్సరాలపాటు రైతాంగానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు తదితరాలను ఉచితంగా కల్పించాలి.
4. ఇళ్ళుకోల్పోయిన పేదలకు, వ్యవసాయ కూలీలకు, మత్స్యకారులందరికీ పక్కా ఇళ్ళు నిర్మించి ఇవ్వాలి. వారు కోల్పోయిన పని దినాలకు పరిహారం చెల్లించాలి. తక్షణం ఉపాధి కల్పించాలి.
5. మత్స్యకారులు, ఇతర చేతివృత్తులవారు కోల్పోయిన పడవలు, వలలు ఇతర పరికరాలన్నింటినీ వారికి అందచేయాలి.
6. తోపుడు బళ్ళు, చిన్నవ్యాపారులతోపాటు ఆటో రిక్షాలకు జరిగిన నష్టాన్ని చెల్లించాలి.
7. తీవ్రంగా నష్టపోయిన చిన్నపరిశ్రమల పునరుద్ధరణకు తక్షణ చర్యలు చేపట్టాలి. వారికి విద్యుత్, రుణసౌకర్యం, పన్నురాయితీ కల్పించాలి.
8. హుదూద్ తుఫాన్‌తో నిరవధికంగా పనులు కోల్పోయిన కార్మికులకు ప్రత్యేకించి కాంట్రాక్టు కార్మికులకు నష్టపరిహారంతోపాటు తిరిగి పనులు కల్పించాలి.
9. తీరప్రాంతంలో మడ అడవులు, సరుగుడు తోటలు, తాడిచెట్ల పెంపకంతోపాటు, తుఫాన్ షెల్టర్ల, విద్యా సంస్థల, కార్యాలయాల సమర్ధ నిర్వహణకు, ఖచ్చితమైన తీరప్రాంత నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

### II. రైతుల, డ్వాక్రా మహిళల, చేనేత కార్మికుల రుణాలు మాఫీ చేయాలని -

తెలుగుదేశం ప్రభుత్వం రైతుల, డ్వాక్రామహిళల, చేనేత కార్మికుల రుణాలను మాఫీ చేస్తామనే గంభీర ప్రకటనలు మినహా ఆచరణలో వాటిని సాధ్యమైనంతగా కుదించటానికే కసరత్తులు చేస్తోంది. ఈనాటికీ ఆచరణలో ఏ ఒక్క రుణాన్నీ మాఫీ చేయలేదు. మరోవైపున కనీసపాటిగా అందే సంస్థాగత రుణాలను కూడా అందించలేదు. రైతుల రుణమాఫీని వెంటనే అమలుచేయాలని, వారికి అవసరమైన సంస్థాగత రుణసౌకర్యాన్ని కల్పించాలని రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) డిమాండ్ చేస్తోంది.

### III. రైతుల ఆత్మహత్యలన్నీ, ప్రభుత్వాలు సాగించే హత్యలే

గత 5 నెలల కాలంలో తెలంగాణా రాష్ట్రంలో 320 మందిపైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రుణభారం పెరిగిపోయి, ప్రకృతివిపత్తులకు లోనై అనేకమంది రైతులు ముఖ్యంగా కౌలురైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. వ్యవసాయ అవసరాలైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలను పెంచివేసి, విద్యుత్తు సక్రమంగా సరఫరా చేయక, సకాలంలో సాగునీరు, సంస్థాగత రుణాలు, గిట్టుబాటు ధరలు కల్పించని పాలకులే రైతుల ఆత్మహత్యలకు కారకులని రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) ప్రకటిస్తోంది. ఆత్మహత్యలను నివారించే చర్యలను తక్షణం చేపట్టాల్సిందిగా ప్రభుత్వాలను డిమాండ్ చేస్తోంది. ✡

## రాజధాని నిర్మాణంపేరిట ప్రభుత్వం రైతుల భూములను గుంజుకొనే ప్రయత్నాలను ఆపివేయాలి

**గుంటూరు** జిల్లా - తుళ్ళూరు పరిసర ప్రాంతాలలో రాజధాని నిర్మాణం చేయబూనుకున్నట్లుగా చంద్రబాబునాయుడు ప్రభుత్వం ప్రకటించింది. మూడు పంటలు పండే సారవంతమైన ఈ ప్రాంతంలో 30 వేల ఎకరాలను సమీకరించే ప్రయత్నాలను వేగిరం చేస్తోంది. తుళ్ళూరు కేంద్రంగా 180 చ॥కి॥మీ పరిధిలో రింగురోడ్డు నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెల్పి నాలుగువేల కోట్ల రూ॥ నిధులు మంజూరుచేసినట్లుగా కూడా ఊదరగొడ్తోంది. చట్టబద్ధతలేని భూసమీకరణపేరుతో, ఎకరాకు వెయ్యిగజాల స్థలాన్ని అభివృద్ధి చేసి ఇస్తామంటూ, కోట్ల రూపాయల ఆస్థిని సమకూరుస్తామంటూ రైతులకు అరచేతిలో వైకుంఠం చూపిస్తోంది.

పంటలు పండే సారవంతమైన భూములను సేకరించటం, ఆయా రైతులకేకాక, రాష్ట్ర ప్రయోజనాలకు కూడా నష్టకరం. కాగా, ఈ ప్రాంతాన్ని చుట్టుకొని రాజధాని ఏర్పాటు నిర్ణయం ఎందుకు చేయవలసివచ్చిందో ప్రభుత్వంవైపు నుండి వివరణేమీ లేదు. కనుక ఈ రాజధాని నిర్మాణానికి ప్రజల అవసరాలతో నిమిత్తంలేదని, రానున్న కాలంలో బడా, బహుళజాతి కంపెనీలకు భూమిని ధారాదత్తం చేయటం కోసమే వేల ఎకరాలను ప్రభుత్వం సేకరించదలచుకుందని స్పష్టమౌతుంది. రాజధాని నిర్మాణం పేరుతో ఈ ప్రాంతంలో రైతుల నుండి భూములను సమీకరించటం లేదా సేకరించటాన్ని రైతుకూలీసంఘం(ఆం.ప్ర) తీవ్రంగా నిరసిస్తోంది. ప్రభుత్వం కల్పించే భ్రమలకు లోనుగాకుండా రైతులంతా ఐక్యంగా ప్రభుత్వ ప్రజావ్యతిరేక, రైతు వ్యతిరేక భూసమీకరణ యత్నాలను అడ్డుకోవాలని పిలుపునిస్తున్నది

**విజయవాడ,**
**1-11-14**

**ఎస్. ఝాన్సి, అధ్యక్షులు**
**రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)**

# ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం - గుణపాఠాలు

చంద్ర పుల్లారెడ్డి

*సి.పి.యం. నాయకత్వం జైలులో వున్న సందర్భంలో కా॥ సి.పి., కా॥ మానికొండ సుబ్బారావు కలిసి "అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర" అన్న గ్రంధాన్ని రచించారు. జైలు నుండి వెలుపలికి వచ్చిన తర్వాత కా॥ పుచ్చలపల్లి సుందరయ్య ముందుమాటతో దీనిని ప్రచురించారు. సి.పి.యం.తో సిద్ధాంత, రాజకీయ పోరాటం ప్రారంభమవటంతో పై గ్రంథాన్ని క్లుప్తీకరించి, "ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం - గుణపాఠాలు" అన్న కరపత్రంగా ప్రచురించారు. దీనిపై నాటి సి.పి.యం. నాయకత్వం నిషేధాన్ని విధించింది.*

*రివిజనిజానికి వ్యతిరేకంగా సాగిన ఈ పోరాటం, దాని ప్రాధాన్యత దృష్ట్యా, ఈనాటికీ దాని నుండి నేర్చుకోవలసిన అవసరమున్నందున కా॥ చంద్ర పుల్లారెడ్డి 30వ వర్ధంతి సందర్భంగా ఈ వ్యాసాన్ని పునర్ముద్రిస్తున్నాము.*

**- సంపాదకుడు**



## ఉపోద్ఘాతం

**ప్రపంచ** కార్మికవర్గ ఆశయాలను - మార్క్సు, ఏంగెల్స్‌లు - 1848 కమ్యూనిస్టు మానిఫెస్టోలో ప్రకటించారు.

పెట్టుబడిదారీ వ్యవస్థను సమూలంగా కూలద్రోసి దాని స్థానే సోషలిస్టు వ్యవస్థ స్థాపన ఒక్కటే కార్మికవర్గ విముక్తికి దారితీస్తుందని నిస్సందేహంగా ప్రకటించారు.

"కమ్యూనిస్టులు తమ అభిప్రాయాలను ఎప్పుడూ దాచుకొనరు. ప్రస్తుత సాంఘిక వ్యవస్థను బలవంతంగా కూలద్రోయుట ద్వారానే తమ ఆశయాన్ని సాధించుకో గల్గుతారని బహిరంగంగా ప్రకటించుకుంటారు. కార్మిక వర్గానికి తమ బానిస సంకెళ్ళు తప్ప పోయేదేమీ లేదు. ప్రపంచమే సాధించుకుంటారు."

"ప్రపంచ కార్మికులారా ఏకంకండి".

ఈ నినాదం నినదించింది 1848లో. ఈనాడు అది ప్రపంచమంతా మారు మ్రోగుతున్నది. 100 కోట్ల జనాభా పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి శాశ్వతంగా విముక్తి చెందింది. సోషలిస్టు పంథా చేపట్టింది.

సామ్రాజ్యవాద వ్యవస్థ కూలిపోతున్నది. వలస విముక్తి ఉద్యమాలు పెనుతుఫానులాగా విజృంభిస్తున్నాయి.

పెట్టుబడిదారీదేశాల్లోని కార్మికవర్గం, కమ్యూనిస్టు పార్టీల నాయకత్వాన పెట్టుబడిదారీ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడుతున్నది.

ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం ప్రపంచ సామ్రాజ్యవాద వ్యవస్థపై అంతిమ విజయాన్ని సాధించగల దశలో మనమున్నాం.

ఈలాంటి శుభతరుణంలో ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో ఈనాటి కవసరమైన వ్యూహం - ఎత్తుగడలకు సంబంధించిన సిద్ధాంత సమస్యల్లో తీవ్రమైన అభిప్రాయభేదాలు తలెత్తాయి.

ఈనాడు ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ భవిష్యత్తు గురించి, పోరాటరూపాల గురించి, వ్యూహం ఎత్తుగడల గురించి ప్రతి కమ్యూనిస్టు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో వివిధ ఘట్టాలు, అవి యిచ్చిన గుణపాఠాలు జాగ్రత్తగా పరిశీలించితే ఈనాటి మన సమస్యలకు తప్పకుండా సరైన దారి దొరుకుతుంది.

ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమాన్ని 5 ముఖ్యమైన భాగాలుగా విభజించి పరిశీలించవచ్చు. (1) 1848 నుండి 1871 వరకు (2) 1871 పారిస్ కమ్యూన్ నుండి 1905 రష్యా విప్లవం వరకు (3) 1905 నుండి 1917 విప్లవం వరకు (4) 1917 నుండి 1949 చైనా విప్లవం వరకు (5) 1949 చైనా విప్లవం తర్వాత పరిస్థితి.

ఈ ఐదు దశలలోను కమ్యూనిస్టు ఉద్యమం సాధించిన విజయాలు, అనుభవాలు లోతుగా పరిశీలించుదాం.

## మొదటి దశ

## 1848 నుండి 1871 వరకు

15, 16 శతాబ్దాలలో అనేకమంది ఓడ సాహసికులు సముద్రాంతర ప్రయాణాలు చేశారు. నూతన దేశాలను, ఖండాలను కనుగొన్నారు. సముద్రాల ద్వారా రవాణా మార్గాలు ఏర్పడ్డాయి. వాణిజ్య వ్యాపారాలు ఎంతో అభివృద్ధి చెందాయి. శాస్త్ర అభివృద్ధి భారీ పరిశ్రమల నిర్మాణానికి పునాదులు వేసింది. వలస దేశాల ఆక్రమణ పశ్చిమ యూరోపు దేశాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుట కవసరమైన పెట్టుబడిని సంపాదించి పెట్టింది. పశ్చిమ యూరోపులో పారిశ్రామిక విప్లవానికి పునాదులు వేసింది.

18వ శతాబ్దం మధ్యలో ఇంగ్లాండులో పారిశ్రామిక విప్లవం ప్రారంభమయింది. అది క్రమంగా యూరోపుకు ప్రాకింది.

పారిశ్రామిక విప్లవం పరిశ్రమల్ని, వ్యాపారాన్ని అత్యంత వేగంగా అభివృద్ధి చేసింది. ఆధునిక బూర్జువా వర్గాన్ని సృష్టించింది.

పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందకుండా అడ్డుగా వున్న ఫ్యూడల్ వ్యవస్థను, దాని రాజ్యాంగ యంత్రాన్ని బ్రద్దలు చేయటానికి పెట్టుబడిదారీ వర్గం పూనుకున్నది. 1649 ఇంగ్లాండు, 1776 అమెరికా, 1789 ఫ్రాన్సు, 1830 ఫ్రాన్సు, 1848 ఫ్రాన్సు, 1830 ఫ్రాన్సు, జర్మనీ, ఆస్ట్రియా, హంగరీ, ఇటలీ - ఈ విధంగా బూర్జువా విప్లవాలు కొనసాగాయి. ఈ విప్లవాల ఫలితంగా ప్రపంచ వ్యాపితంగా పెట్టుబడిదారీ విధానం స్థాపితమైంది. యూరపులో ఆధునిక బూర్జువా వర్గ ప్రభుత్వాలు కూడ ఏర్పడ్డాయి.

పారిశ్రామిక విప్లవంతో పారిశ్రామిక కార్మికవర్గం పెద్దఎత్తున సృష్టించబడింది. తమపై సాగుతున్న అమానుష దోపిడీకి వ్యతిరేకంగా కార్మికవర్గం అనేక తిరుగుబాట్లు లేవదీసింది. క్రమంగా సంఘటిత ట్రేడ్ యూనియన్ ఉద్యమ నిర్మాణానికి పూనుకున్నది.

### చార్టిస్టు ఉద్యమం

ఇంగ్లాండులో మొదటి కార్మిక ఉద్యమానికి పునాదులు వేసింది. 1837-50 సంవత్సరాల కాలంలో బ్రిటీషు కార్మికులు చార్టిస్టు ఉద్యమాన్ని నడిపారు. ఈ ఉద్యమం ప్రధానంగా కార్మికుల ఓటింగు కొరకు జరిగిన పోరాటం.

పురుషులందరికి ఓటింగు హక్కు, సమాన ఓటింగు గల నియోజకవర్గాలు, సాంవత్సరిక పార్లమెంటు సమావేశాలు, పార్లమెంటు సభ్యులకు జీతాలు, రహస్యఓటింగు, పార్లమెంటు సభ్యత్వానికి ఆస్థి షరతు రద్దు.

ఈ కోర్కెలపై 33 లక్షల సంతకాలతో పార్లమెంటుకు పిటీషన్ యివ్వబడింది. పార్లమెంటు నిరాకరించింది. సమ్మెలు జరిగాయి. కొన్నిచోట్ల సాయుధ పోరాటరూపం తీసుకున్నది. అయినా విజయం పొందలేక పోయింది.

పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా బ్రిటీషు కార్మికవర్గం జరిపిన మొదటి రాజకీయ పోరాటంగా యిది గుర్తించబడింది. ప్రపంచ కార్మికోద్యమ పురోగమనానికి యిది ఎంతగానో తోడ్పడింది.

### 1847 కమ్యూనిస్టు లీగు

మార్క్సు, ఏంగెల్స్‌లు రంగంమీదికి రాకపూర్వం కార్మికులలో ఊహాజనిత సోషలిస్టు సిద్ధాంతాలు విరివిగా ప్రచారంలో నున్నవి. ఈ ఊహాజనిత సోషలిస్టు సిద్ధాంతం పెట్టుబడిదారీ సమాజములో అంతర్భాగంగా నున్న వర్గపోరాటాలు, వాటి సూత్రాలు గమనించ కుండా, పెట్టుబడిదారీ వ్యవస్థను కూలద్రోయకుండానే, పెట్టుబడిదారులు కార్మికులను ఉదారభావంతో చూసేలాగు చేయటం ద్వారా సమాజాన్ని మార్చవచ్చని భావించారు. కార్మికులకు పరిశ్రమలలో వచ్చే లాభాలను న్యాయంగా పంచే పద్ధతిపై, ఆదర్శవంతమైన పద్ధతిలో కొంతమంది పరిశ్రమలను నడపటం ద్వారా మొత్తం పెట్టుబడిదారీ వర్గంచేత అందుకు ఒప్పించ గల్గుతామని ఆశించారు. తద్వారా కార్మికవర్గ దోపిడి అంతమౌతుందని కలలు గన్నారు.

ఈలాంటి పరిస్థితులలో మార్క్సు, ఏంగెల్స్‌లు కార్మికోద్యమ రంగంమీదికి వచ్చారు. పెట్టుబడిదారీ సమాజంలో నిరంతరం జరుగుతున్న వర్గ పోరాట సూత్రాలను పరిశీలించారు. కార్మికవర్గ నాయకత్వాన పీడిత వర్గాలన్నిటినీ సమీకరించి పెట్టుబడిదారీ సమాజాన్ని వర్గ పోరాటాల ద్వారా కూలద్రోయటం ద్వారానే పీడిత ప్రజల విముక్తి సాధ్యమౌతుందనే నిర్ణయానికి వచ్చారు.

పశ్చిమ యూరోపులో ఫ్యూడల్, రాచరిక, వ్యాపార వర్గాలకు వ్యతిరేకంగా బూర్జువా ప్రజాస్వామిక విప్లవాలు జరుగుతున్న రోజులవి. ఈ విప్లవాలలో పాల్గొన్న అనేకమంది విప్లవకారులను తమ దేశాల నుండి ఆయా దేశాల ప్రభుత్వాలు వెళ్ళగొట్టిన రోజులవి. ఈలాంటి విప్లవకారులంతా 1847లో ఇంగ్లాండులో సమావేశమై కమ్యూనిస్టు లీగును ఏర్పర్చారు. ఈ లీగు తరపున 1848 ఫిబ్రవరిలో మార్క్సు, ఏంగెల్స్‌లచే రచించబడిన 'కమ్యూనిస్టు మానిఫెస్టో' ప్రకటించబడింది.

- సమాజ చరిత్రంతా వర్గపోరాటాల చరిత్రయని మానిఫెస్టో ప్రకటించింది.
- పెట్టుబడిదారీ సమాజంలో సామూహిక ఉత్పత్తికి; వ్యక్తిగత అనుభవానికి మధ్యనున్న వైరుధ్యం; ఉత్పత్తి సాధనాలకు, ఉత్పత్తి పంపిణీ మధ్యనున్న వైరుధ్యం సంక్షోభాలకు దారితీయక తప్పదన్నది. పెట్టుబడిదారీ వర్గానికి, కార్మికవర్గానికి మధ్యనున్న వైరుధ్యం తీవ్రమై పెట్టుబడిదారీ సమాజం నాశనం కాక తప్పదని, కార్మిక వర్గం విజయం పొందక తప్పదనీ ఉద్ఘాటించింది.
- కార్మికవర్గంలో అంతవరకు ప్రచారంలో ఉన్న తప్పుడు సోషలిస్టు సిద్ధాంతాలనన్నిటిని నిశితంగా ఖండించింది.

పెట్టుబడిదారీ సమాజంలోని కుళ్ళును, దోపిడీని ఫ్యూడల్ సోషలిజం తీవ్రంగా విమర్శించింది. కానీ అంతటితోనే ఆగిపోయింది. విముక్తికి ముందుబాట చూపలేదు. వెనుకటి ఫ్యూడల్ సమాజం వైపు ప్రజల ఆలోచన మళ్ళించడానికి ప్రయత్నించింది. ప్రచారాన్ని క్రైస్తవ మతంతో జోడించింది. ఈ లోకంలో కష్టాలు అనుభవించినా, పరలోకంలో సౌఖ్యమొస్తుందని కార్మికులను వూరడించింది. మానిఫెస్టో ఈ సిద్ధాంతాన్ని ఎండ గట్టింది.

రైతాంగం, మధ్యతరగతి వర్గాల కోర్కెలు ప్రతిబింబించింది బూర్జువా సిద్ధాంతం. ఈ సిద్ధాంతం కూడ పెట్టుబడిదారీ సమాజంలోని అన్యాయాలను ఎలుగెత్తి ఖండించింది గాని ముందుదారి చూపలేదు. ప్రస్తుత ఆస్తి సంబంధాల చట్రంలోనే కార్మికుల పరిస్థితి బాగుపడాలనేదే వీరి ఆశయమంతా. మానిఫెస్టో ఈ సిద్ధాంతం యొక్క బలహీనతలను ఎత్తి చూపింది.

వర్గపోరాటాన్ని వ్యతిరేకించే ఉదారవాద సిద్ధాంతాలను, ఇతర బూర్జువా సిద్ధాంతాలనన్నిటినీ మానిఫెస్టో నిశితంగా విమర్శించింది.

ప్రపంచ పెట్టుబడిదారీవ్యవస్థను కూలద్రోయ టానికి ముందుకు రమ్మని ప్రపంచ కార్మికులందరికీ పిలుపిచ్చింది.

### 1848 ఫ్రెంచి విప్లవం

1818లో యూరప్ అంతటా బూర్జువా విప్లవాలు ఉధృతంగా వచ్చాయి. ఇందులో 1848 ఫ్రెంచ్ విప్లవం చాల ముఖ్యమైంది.

1847లో తీవ్రమైన ఆర్థిక సంక్షోభం పరిశ్రమల్ని స్థంభింపచేసింది. నిరుద్యోగం తాండవించింది. అశేష జన సామాన్యం దురవస్థలకు గురి అయింది.

అధికారములోనున్న రాచరిక, ఫ్యూడల్, వ్యాపార వర్గాలకు వ్యతిరేకంగా అభివృద్ధిచెందుతున్న పారిశ్రామిక వర్గం, కార్మికవర్గం, మధ్యతరగతి వర్గాలు సాగించిన బూర్జువా ప్రజాస్వామిక విప్లవమది.

ఈ విప్లవం 1848 ఫిబ్రవరి24న ప్రారంభమైంది. పారిస్ పట్టణంలో కార్మికవర్గం తిరుగుబాటు చేసింది. రాచరిక ప్రభుత్వాన్ని కూలదోశారు. తాత్కాలిక ప్రభుత్వము ఏర్పాటు చేయబడింది.

ఈ తాత్కాలిక ప్రభుత్వమే కార్మికవర్గ ప్రాథమిక కోర్కెలు నెరవేర్చుతుందని కార్మికవర్గం ఆశించింది. కాని, పెట్టుబడిదారీవర్గం ఈ కార్మికవర్గం యొక్క ఆశలను వమ్ముచేసింది. కార్మికవర్గ విప్లవాలను చూసి భయపడింది. ఫ్యూడల్ వర్గాలతో రాజీ పడింది ఇద్దరూ కలిసి కార్మికవర్గాన్ని అణచివేశారు.

1848 ఫ్రెంచి బూర్జువా విప్లవంతో మార్క్సు సిద్ధాంతము - ఆయనకు పూర్వమున్న బూర్జువా, పెట్టీబూర్జువా సోషలిస్టు సిద్ధాంతాలన్నీ పరీక్షకు గురిచేయబడినాయి. ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్త చేయడంలో వివిధ వర్గాల చారిత్రక పాత్ర స్పష్టమైంది.

1848 ఫ్రెంచి విప్లవ వైఫల్యం నుండి మార్క్సు కార్మికవర్గానికి విలువైన గుణపాఠాల్ని అందచేశారు.

### గుణపాఠాలు

- ఆధునిక కార్మికవర్గానికీ, ఆధునిక పెట్టుబడిదారీ వర్గానికీ జరిగిన మొట్టమొదటి వర్గపోరాటమిది.
- విప్లవ పరిస్థితులలో ప్రతివర్గము యొక్క పాత్ర స్పష్టంగా బయటపడింది.
- బూర్జువా పార్లమెంటరీ విధానంపైన కార్మికవర్గం యొక్క భ్రమలను తొలగించింది.
- కార్మికవిప్లవం సందర్భంలో బూర్జువావర్గం బూర్జువా పార్లమెంటరీ విధానాన్ని కూడా రద్దు చేస్తుందని రుజువైంది.
- కార్మికవర్గం, ఇతర పీడితవర్గాల విముక్తి కార్మిక నియంతృత్వం ద్వారానే సాధ్యమని రుజువైంది.
- కార్మికులు, రైతుల మధ్య ఐక్యత ఉన్నప్పుడే కార్మిక వర్గ విప్లవం జయప్రదమౌతుందని స్పష్టపడింది.
- కార్మికవర్గం యొక్క సహాయం లేకుండా మధ్యతరగతి వర్గాలు తమ స్వంత కాళ్ళపై నిలబడలేవని తేలింది.
- పెద్ద పెట్టుబడిదారులు, భూస్వామ్య వర్గాలు కలిసి కార్మిక వర్గాన్ని వ్యతిరేకించటం సహజమైంది. పై రెండు వర్గాల మధ్య వైరుధ్యం చాల పరిమితమైంది.
- పెట్టుబడిదారీ ప్రపంచములో ఏ దేశములోనైనా కార్మికవర్గ విప్లవం జయప్రదం కావాలంటే ప్రపంచ విప్లవకర పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది.
- కార్మికవర్గం మాత్రమే సోషలిజం కొరకు ఖచ్చితంగా నిలబడి పోరాడుతుందని స్పష్టమైంది.

ఈ విధంగా ఆచరణలో ఫ్రెంచి విప్లవ పోరాటం ద్వారా కార్మికవర్గం యొక్క చారిత్రక పాత్రను గుర్తించిన మార్క్సిస్టుసిద్ధాంతము యితర బూర్జువా, పెట్టీబూర్జువా సిద్ధాంతాలపై విజయాన్ని సాధించింది.

ఈ విషయంపై లెనిన్ అన్నమాటలివి :

"1848 విప్లవం-మార్క్సుకు ముందు ఉన్న కుక్క గొడుగు సిద్ధాంతాలన్నిటిపైన చావుదెబ్బ తీసింది".

(ప్రపంచ కార్మిక, కమ్యూనిస్టు ఉద్యమము - లెనిన్; ఇంగ్లీషు ప్రచురణ - పేజీ 168)

ఫ్రెంచి విప్లవంతోబాటు జర్మనీ తదితర యూరోపియన్ బూర్జువా విప్లవాలన్నీ పెట్టుబడిదారీ వర్గము ద్రోహం ఫలితంగా విఫలమయ్యాయి.

కమ్యూనిస్టు లీగు, మార్క్సు, ఎంగెల్స్‌లు ఈ విప్లవాలను జయప్రదం చేయటానికి తీవ్రంగా కృషి చేశారు. ఈ విప్లవాల వైఫల్యంతో లీగు కార్యకలాపాలపై యూరోపంతటా తీవ్రమైన నిర్బంధం ప్రయోగించ బడింది. మరొకవైపున లీగులో ముఠా తత్వాలు ప్రబలాయి. కార్మికవర్గంలో తాత్కాలికంగా నిరుత్సాహం ప్రబలింది. తత్ఫలితంగా 1852లో కమ్యూనిస్టు లీగు అంతరించింది.

ఐనా, మార్క్సు, ఎంగెల్స్‌లు కార్మిక ఉద్యమానికి అవసరమైన శాస్త్రీయ గ్రంథాలలో పెక్కింటిని ఈ కాలంలోనే రచించారు.

### 1864 మొదటి ఇంటర్నేషనల్ స్థాపన

1848లో వచ్చిన బూర్జువా ప్రజాస్వామిక విప్లవాలు ఊరకపోలేదు. బూర్జువా వర్గం క్రమంగా ప్రభుత్వ అధికారాన్ని చేజిక్కించుకోగల్గింది. పారిశ్రామికాభివృద్ధి జరిగింది. తత్ఫలితంగా కార్మికవర్గం సంఖ్య రీత్యా పెరిగింది.

ఇంగ్లాండు, ఫ్రాన్స్, అమెరికా, జర్మనీ మొదలైన దేశాలలో కార్మికవర్గం తిరిగి పోరాటానికి సన్నద్ధమైంది. వివిధ దేశాలలో జరుగుతున్న ఈ పోరాటాలను సమన్వయపర్చి ముందుకు తీసుకుపోవడానికి కార్మికవర్గ అంతర్జాతీయ సంస్థ యొక్క ఆవశ్యకత గుర్తించబడింది.

ఈ పరిస్థితులలో 1864లో సెప్టెబర్ 28న లండనులో మొదటి అంతర్జాతీయ సంస్థ స్థాపించబడింది.

మొదటి ఇంటర్నేషనల్ ఒకే రాజకీయ సిద్ధాంతముపై ఆధారపడిన సంస్థగాదు. మార్క్సిజం, వర్గపోరాట సిద్ధాంతానికి వ్యతిరేకమైన సిద్ధాంతాలు కలవారు కూడా గ్రుపులుగా ఈ సంస్థలో నున్నారు. ఈ తప్పుడు సోషలిస్టు సిద్ధాంతాలన్నింటికీ వ్యతిరేకంగా కార్మికోద్యమ నాయకత్వం కొరకు మార్క్సిస్టు సిద్ధాంతం ఈ కాలంలో తీవ్రమైన పోరాటం జరిపింది.

రాజకీయాలతో సంబంధంలేని ట్రేడ్‌యూనియన్ లను నిర్మించాలనే బ్రిటిషు సోషలిస్టు సిద్ధాంతాలకు వ్యతిరేకంగా, బలమైన కార్మికోద్యమంతో సంబంధం లేకుండా సాయుధపోరాటం నడపాలనే బ్లాంక్వి దుందుడుకు సిద్ధాంతాలకు వ్యతిరేకంగా, కో-ఆపరేటివ్ సంస్థల ద్వారా సోషలిజాన్ని స్థాపించవచ్చనే ప్రొడాన్, లస్సలే సిద్ధాంతాలకు వ్యతిరేకంగా, బకూనిన్ అనార్కిస్టు

సిద్ధాంతానికి వ్యతిరేకంగా మార్క్సు, ఎంగెల్సులు మొదటి ఇంటర్నేషనల్ కాలమంతా పోరాడారు. ఈ పోరాటాన్ని గూర్చి మార్క్సు ఇలా అన్నాడు :

"మొదటి ఇంటర్నేషనల్ కాలమంతా, నిజమైన కార్మికోద్యమానికి వ్యతిరేకంగా చిన్నచిన్న గ్రూపులు సాగించిన కుట్రలకు వ్యతిరేకంగా జనరల్ కౌన్సిలు ఎడతెరిపి లేని పోరాటం సాగించింది".

*(మార్క్సు, ఎంగెల్స్‌ల ఉత్తరాలు, పేజీ 326)*

ఈ కాలంలో మొదటి ఇంటర్నేషనల్ ప్రపంచ కార్మికోద్యమాన్ని ఐక్యపరచటానికి, మార్క్సిస్టు సిద్ధాంత పునాదిపై విజ్ఞానవంతుల్ని చేయుటకు తీవ్రంగా కృషిచేసింది.

బూర్జువా ప్రభుత్వం, ట్రేడ్ యూనియన్ సంఘాలు, కో-ఆపరేటివ్ సంస్థలు, సార్వత్రిక ఎన్నికలు స్త్రీల సమస్య, రైతాంగ సమస్యలు, జాతీయ సమస్యలు - వీటన్నిటి ఎడల కార్మికవర్గం యొక్క పాలసీ - ఎత్తుగడలను మొదటి ఇంటర్నేషనల్ రూపొందించింది.

తక్షణ సమస్యలపై పోరాటం, కార్మికవర్గ అంతిమ విప్లవానికి అవసరమైన సాయుధపోరాట ఎత్తుగడలు - కార్మిక నియంతృత్వ స్థాపనా లక్ష్యాన్ని మొదటి ఇంటర్నేషనల్ ప్రపంచకార్మికులందరి ముందుంచింది.

వివిధ దేశాల్లోని కార్మికోద్యమాలను సమన్వయ పరచి వారిలో అంతర్జాతీయతత్వాన్ని పెంపొందింప జేసింది. వివిధదేశాల్లో చెల్లాచెదురుగానున్న చిన్నచిన్న కార్మికోద్యమాలను సంఘటితపరచి బలమైన అంతర్జాతీయ కార్మికోద్యమంగా రూపొందించి ప్రపంచ పెట్టుబడిదారీవర్గానికి బలమైన పోటీశక్తిగా తయారు చేసింది.

## 1871 పారిస్ కమ్యూన్

1870లో ఫ్రాన్సులో లూయిబోనపార్టీ ప్రభుత్వం అధికారంలో నున్నది. కార్మికవర్గం మరొక విప్లవ పోరాటానికి సన్నద్ధమౌతున్నది. ఈ పోరాటాన్ని ప్రక్కదారులు పట్టించడానికి ప్రభుత్వం జర్మనీతో సరిహద్దు యుద్ధానికి తయారయింది. జర్మనీలోని బిస్మార్కు ప్రభుత్వం కూడా ఈలాంటి సమయం కొరకు ఎదురుచూస్తున్నది.

తత్ఫలితంగా ఈ రెండు దేశాలమధ్య 1870 జులై 9న యుద్ధం ప్రారంభమైంది. ఫ్రెంచి ప్రభుత్వ సైన్యాలు సెప్టెంబర్ 2వ తేదీన బేషరతుగా లొంగిపోయాయి.

సెప్టెంబరు 4వ తేదీన ఫ్రాన్సులో బోనపార్టీ ప్రభుత్వాన్ని కూలద్రోసి క్రొత్త రిపబ్లిక్ ప్రభుత్వం స్థాపించబడింది. ఈ ప్రభుత్వంలో కూడా నాయకత్వం బూర్జువావర్గానిదే. దీనికి నాయకుడు ధేర్సు.

ధేర్సు ప్రభుత్వం జర్మనీతో యుద్ధం కొనసాగించటం కాకుండా, జర్మనీతో రాజీపడటానికే ప్రయత్నించింది. ఈ మోసాన్ని కనిపెట్టిన పారిస్ కార్మికవర్గం 1871 మార్చి 18న పారిస్ నగరములో తిరుగుబాటుచేసి కార్మికవర్గ నాయకత్వాన పారిస్ కమ్యూన్ ప్రభుత్వాన్ని స్థాపించింది.

ధేర్సు ప్రభుత్వ సైన్యాలు, బిస్మార్కు ప్రభుత్వ సైన్యాలు రెండు ఏకమై పారిస్ కమ్యూన్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి జాయింటుగా దాడిచేశాయి. కమ్యూన్ ప్రభుత్వం మూడు వారాలపాటు ప్రతిఘటించి ఓడిపోయింది. 1871 మే 28వ తేదీన పారిస్ కమ్యూన్ కూలద్రోయబడింది.

మార్క్సు పారిస్ కమ్యూన్ తిరుగుబాటు సందర్భములోనే తిరుగుబాటుకు సమయము ఆసన్నముకాలేదని కార్మికవర్గాన్ని హెచ్చరించాడు. ఐనా కమ్యూన్ స్థాపించబడిన తరువాత మార్క్సు, మొదటి ఇంటర్నేషనల్‌కు చెందిన నాయకులు కమ్యూన్‌ను జయప్రదం చేయడానికి తమ శక్తి కొద్ది కృషిచేశారు.

### పారిస్ కమ్యూన్ గుణపాఠాలు

పారిస్ కమ్యూను నుండి ప్రపంచ కార్మిక, కమ్యూనిస్టు ఉద్యమాలకు మార్క్సు విలువైన పాఠాలందజేశాడు.

ఫ్రాన్సులో పెట్టుబడిదారీ అభివృద్ధి క్రమమింకా పూర్తికాలేదు. కనుకనే పారిస్ కమ్యూను విఫల మయిందని మార్క్సు హెచ్చరించాడు. ఫ్రెంచి రైతాంగాన్ని కార్మికవర్గం తనవెనుక సంపూర్ణంగా సమీకరించుకోలేక పోవుటవల్లే పారిస్ కమ్యూన్ విఫలమయిందని హెచ్చరించాడు. పారిస్‌లో ప్రారంభ మయిన విప్లవాన్ని ఆలస్యం చేయకుండా యితర ప్రాంతాలకు విస్తరింప చేయకపోవుటవల్లే ఈ వైఫల్యం వచ్చిందని హెచ్చరించాడు.

భవిష్యత్తు కార్మికోద్యమానికి పారిస్ కమ్యూన్ ఈ క్రింది గుణపాఠాలంద జేసింది.

- పీడితవర్గాలన్నిటిలోకి కార్మికవర్గం మాత్రమే నాయకత్వ పాత్ర అర్హతలను రుజువు చేసుకున్నది.
- కార్మిక, రైతు ఐక్యత లేకుండా ఏ విప్లవమూ జయప్రదం కానేరదు.
- పీడిత ప్రజల విప్లవాలను అణచడానికి పాలకవర్గం ఎంతటి రాక్షసత్వానికి పూనుకుంటుందో బహిర్గత మయ్యింది.
- కార్మికవర్గ విప్లవానికి భయపడి బూర్జువావర్గం తమదేశాన్ని పరాయి దేశాలకు అమ్మడానికి కూడా సిద్ధపడుతుందని పారిస్ కమ్యూన్ స్పష్టపరిచింది.
- కార్మికవర్గం తన విముక్తి కొరకు పాత బూర్జువా రాజ్యాంగ యంత్రాన్ని ఉపయోగించలేదు. దాన్ని పూర్తిగా ధ్వంసం చేయాలి. కార్మిక నియంతృత్వ ప్రభుత్వాన్ని స్థాపించుకోవాలి.
- పారిస్ కమ్యూన్ భవిష్యత్ కార్మిక నియంతృత్వానికి బీజరూపం.

పారిస్ కమ్యూన్ కూలిపోయినప్పటికీ అది మొట్ట మొదటిసారిగా ప్రపంచంలో కార్మికవర్గం సాధించిన విజయం. పెట్టుబడిదారీ వ్యవస్థను తొలిసారిగి గట్టిదెబ్బ తీసిన విప్లవ ఘటన అది. అర్ధశతాబ్దం అనంతరం రష్యా విప్లవానికి మార్గదర్శకమయింది. పెట్టుబడిదారి వ్యవస్థకు గండికొట్టిన రష్యన్ విప్లవం పారిస్ కమ్యూన్ పాఠాలను తీసుకున్నది. "ఎన్ని తప్పిదాలు జరిగినా పారిస్ కమ్యూన్ 19వ శతాబ్దంలో కార్మికవర్గం నిర్మించుకున్న ఉజ్వల చారిత్రక జ్యోతి." (లెనిన్)

పారిస్ కమ్యూన్ వైఫల్యం తర్వాత యూరోపియన్ కార్మికోద్యమంపైన తీవ్రమైన నిర్బంధం తాండ వించింది. మరొకవైపు మొదటి ఇంటర్నేషనల్ భాగస్వాములుగా నున్న బకునిన్ అనార్కిస్టు సిద్ధాంతానికి, మార్క్సిస్టు వర్గపోరాట సిద్ధాంతానికి తీవ్రమైన ఘర్షణ ప్రారంభమైంది. మార్క్సు నాయకత్వాన మొదటి ఇంటర్నేషనల్ బకునిన్, అతని అనుచరులను సంస్థ నుండి బహిష్కరించింది. దీనితో మొదటి ఇంటర్నేషనల్ రెండుగా చీలిపోయింది. క్రమంగా బలహీనపడి 1875లో అంతరించింది.

ఐనా ఈ కాలంలో జరిగిన పోరాటాలు కార్మిక వర్గానికి విప్లవ చైతన్యాన్ని కల్గించాయి. విస్తృత కార్మికోద్యమానికి పునాదులు వేసింది. బీజరూపములో కార్మికవర్గ పార్టీలు, సోషల్ డెమోక్రటిక్ పార్టీలు వివిధ దేశాలలో అంకురించాయి.

అన్నింటికంటే ముఖ్యమైనది. మార్క్సు యొక్క శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతం ఇతర సిద్ధాంతాలన్నిటినీ ఓడించి, కార్మికవర్గ ఏకైక సిద్ధాంతంగా రూపొందింది. ఈ పరిణామాలను గురించి లెనిన్ క్రింది విధంగా వివరించారు :

"మార్క్సిస్టు సిద్ధాంతం ఆధునిక సమాజంలో కార్మికవర్గాన్ని చైతన్యవంతులను చేసి సంఘటిత పరుస్తుంది. ఈ వర్గము యొక్క పాత్రను స్పష్టపరుస్తుంది. ఆర్థికాభివృద్ధి క్రమంలో ప్రస్తుత వ్యవస్థ రద్దయి దాని స్థానే నూతన సమాజము తప్పక ఏర్పడి తీరుతుందని స్పష్టపరుస్తుంది. అయితే ఈ సిద్ధాంతం - తన అభివృద్ధి క్రమంలో అడుగడుగునా యిందుకు భిన్నమైన సిద్ధాంతాలతో తీవ్రమైన పోరాటం జరుపవలసి వచ్చింది..."

"మార్క్సిజం తక్షణమే తన స్థానాన్ని స్థిరపర్చు కోలేదు. శతాబ్దము మొదటి అర్ధభాగములో (1840) మార్క్సిజం - తనతో ప్రాథమికంగా భేదించే సిద్ధాంతాలతో పోరాడింది. 1840లో - తాత్విక ఆదర్శవాదాన్ని పట్టుకున్న హెగెల్ అనుచర వర్గాన్ని మార్క్సిజం ఓడించింది. ఆ తరువాత మార్క్సిజం ఆర్థిక రంగంలో ప్రవేశించి 1850 కంతా ప్రౌడాన్ ఆర్థిక సిద్ధాంతాలను ఓడించింది. 1860లో మార్క్సిజం సిద్ధాంతస్థాయి నుండి ఆచరణలో కార్మికవర్గంలో ప్రవేశించింది. సిద్ధాంతాలను ఓడించి ఆచరణలో తన ఆధిక్యతను రుజువుపర్చుకుంది. 1890 కంతా మార్క్సిజం సంపూర్ణ విజయాన్ని సాధించింది. రెండవ ఇంటర్నేషనల్ ఏలాంటి ప్రతిఘటన లేకుండానే మార్క్సిస్టు అవగాహనను అంగీకరించింది."

*(ప్రపంచ కార్మిక - కమ్యూనిస్టు ఉద్యమం - లెనిన్ - పేజీ 90-91)*

## <u>రెండవదశ</u>

## 1871 పారిస్ కమ్యూన్ నుండి 1905 వరకు

మొదటి ఇంటర్నేషనల్ యూరప్‌లో బూర్జువా ప్రజాస్వామిక విప్లవాలు చెలరేగుతున్న సమయంలో పుట్టింది. 1871 ఫ్రాన్సు-జర్మనీ యుద్ధంలో యూరప్‌లో ఫ్యూడలిజం కూలిపోయి పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధిచెందే ఒక నూతన దశ ప్రారంభమైంది.

అంటే, 1871-1905 కాలం వెనుకటి దశతో పోలిస్తే శాంతియుత కాలంగా కూడ చెప్పవచ్చు. యూరప్‌లో బూర్జువా ప్రజాస్వామిక విప్లవాలు 1870కంతా పూర్తయినవి. ఆసియాలో బూర్జువా ప్రజాస్వామిక విప్లవాలు ప్రారంభం కాలేదు.

ఈలాంటి శాంతియుత పరిస్థితులలో రెండవ ఇంటర్నేషనల్ ప్రపంచ కార్మికోద్యమాన్ని ఈ నూతన పరిస్థితులకు తగ్గట్టుగా నడపటానికి 1889 సంవత్సరములో ఏర్పడింది.

ఈ దశలో మార్క్సిస్టు సోషలిస్టుసిద్ధాంతాలు విరివిగా కార్మికవర్గంలో ప్రచారం చేయబడినవి.

స్వతంత్ర పునాదిపై సోషలిస్టు పార్టీలు వివిధ దేశాలలో ఏర్పడినవి. బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థ నుపయోగించుకొని సోషలిస్టు పార్టీలు అభివృద్ధి చెందినవి. స్వంత పత్రికలు స్థాపించుకున్నవి. విస్తృత పునాదిపైన ప్రజాబలం కలిగిన ట్రేడ్ యూనియన్‌లను, కో-ఆపరేటివ్ సంస్థలను అభివృద్ధిచేసినవి. అనేక దేశాలలో మిలిటెంట్ సమ్మె పోరాటాలు నడిపాయి.

ఒక్కమాటలో చెప్పాలంటే ఈ దశలో కార్మికోద్యమం ఒక బ్రహ్మాండమైన శక్తిగా అభివృద్ధి చెందింది. ఆ పునాదిపై వివిధ దేశాలలో సోషలిస్టు పార్టీలు ప్రజాపార్టీలుగా అభివృద్ధి చెందాయి. ఈ మొత్తం దశలో జర్మనీ కార్మికవర్గం, జర్మనీ సోషలిస్టు పార్టీ రెండవ ఇంటర్నేషనల్‌కు నాయకత్వం వహించాయి.

ఐతే ఈ దశలో కార్మికోద్యమంలో మరొక చెదుగు కూడ ప్రవేశించింది.

పెట్టుబడిదారీ వర్గం తమకున్న విపరీత లాభాల నుండి, ముఖ్యంగా వలసల దోపిడీల నుండి - కార్మిక వర్గంలో ఉన్నత భాగాలను సామాన్య కార్మికుల నుండి వేరుచేసి, ఎక్కువ జీతాలు ఇచ్చి, వారిని తమకు తాబేదార్లుగా పనిచేసేవారుగా తయారుచేసుకోగల్గింది. వీరు కార్మికోద్యమంలో ఉంటూనే కార్మికోద్యమాన్ని విప్లవపంథా నుండి మళ్ళించి, సంస్కరణవాద పద్ధతులలోనికి మళ్ళించటానికి పూనుకున్నారు.

కాని కార్మికోద్యమంలోని ఈ రిఫార్మిస్టులు మార్క్సిజంతో బహిరంగపోరాటం జరుపలేకపోయారు. అప్పటికే మార్క్సిజం కార్మికవర్గ ఏకైక సిద్ధాంతంగా రూపొందియుండుట వల్ల రివిజనిస్టులు మార్క్సిజాన్ని సిద్ధాంతరీత్యా అంగీకరిస్తూనే, ఆచరణలో అవకాశవాద పంథా జొప్పించుటకు పూనుకున్నారు. ఈ దశలో పెట్టుబడిదారీ అభివృద్ధిని చూసి, కార్మికవర్గ పోరాటాలు లేకుండానే సోషలిజం చేరగలమని వాదించారు.

రివిజనిజం మార్క్సిస్టు తత్వశాస్త్రాన్ని నిరాక రించింది. బూర్జువా తత్వశాస్త్రాన్ని ప్రవేశపెట్టుటకు ప్రయత్నించింది.

- ఆర్థికరంగంలో మార్క్సిస్టు మూల సూత్రాలకు విరుద్ధమైన సూత్రాలను రివిజనిస్టులు ప్రవేశపెట్టారు. పెట్టుబడి కేంద్రీకరణ సిద్ధాంతాన్ని నిరాకరించారు. వ్యవసాయంలో అది లేనేలేదని వాదన ప్రారంభించారు. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థకు సహజమైన ఆర్థిక సంక్షోభాలు క్రమంగా తగ్గిపోతున్నాయని, గుత్త సంస్థల నిర్మాణం ద్వారా అసలు సంక్షోభాలే అదృశ్యమౌతాయని వాదించారు. రానురాను వర్గ వైరుధ్యాల తీవ్రత తగ్గిపోతుందన్నారు.

- రాజకీయరంగంలో వర్గపోరాట సిద్ధాంతాన్ని తిరస్కరించారు. బూర్జువా ప్రజాస్వామికంలో మెజారిటి ప్రజల అభిప్రాయం చెల్లుతుంది. కనుక ప్రభుత్వం వర్గాధికారానికి చిహ్నమన్న విషయం పాతబడి పోయిందన్నారు. పార్లమెంటు ద్వారా సోషలిజం సాధ్యమన్నారు. అభివృద్ధి కాముకులైన బూర్జువా సంస్కరణ వాదులతో ఐక్యసంఘటనకు కార్మికవర్గం నిరాకరించకూడదన్నారు. అందువల్ల రెండవ ఇంటర్నేషనల్ కాలమంతటా అంతర్జాతీయ కార్మికోద్యమం నిజమైన విప్లవ మార్క్సిస్టుల మధ్య బూటకపు మార్క్సిస్టుల మధ్య చీలియుంది.

రివిజనిస్టులకు ప్రజాసంఘాలలోను, పార్లమెంటు ల్లోను బాధ్యతాయుత స్థానాలలో ఉన్న నాయకులంతా ముఖ్యమైన కార్యకర్తలుగా తయారయ్యారు.

ఈ దశలో రివిజనిస్టు పంథాను వ్యతిరేకించి, ప్రతిఘటించి మార్క్సిజం పవిత్రతను కాపాడవలసిన బాధ్యత లెనిన్ తీసుకున్నాడు.

## <u>మూడవ దశ</u>

## 1905 నుండి 1917 విప్లవం వరకూ

పెట్టుబడిదారీ విధానం శాంతియుతంగా సోషలిజంలోనికి పరివర్తన చెందుతుందనే రివిజనిస్టుల వాదనను లెనిన్ చీల్చిచెండాడాడు. పెట్టుబడిదారీ విధానంలో అగుపడుతున్న శాంతి తాత్కాలికమైన దన్నాడు. అది సామ్రాజ్యవాద దశకు అభివృద్ధి చెందిన సమయంలో త్వరలో వర్గ సంఘర్షణలు, జాతీయ ఘర్షణలు అతితీవ్రస్థాయిలో జరిగి తీరుతాయి అన్నాడు.

లెనిన్ చెప్పినట్లుగానే పెట్టుబడిదారీ ప్రపంచంలో కానవస్తున్న శాంతి త్వరలోనే భగ్నమయింది. 1905 రష్యా - జపాను యుద్ధం, 1905 రష్యా విప్లవం, ఆ తరువాత టర్కీ, రష్యా, చైనా దేశాలలో వచ్చిన ప్రజాస్వామిక విప్లవాలు పెట్టుబడిదారీ సమాజాన్ని ఊపివేసినవి.

ఈ పరిణామాల ప్రాముఖ్యతను గూర్చి లెనిన్ ఇలా అన్నాడు :

"యూరోపు కార్మికవర్గము పోరాడుతున్న ఆశయాల కొరకే 80 కోట్ల ఆసియా ప్రజలు పోరాట రంగంలోనికి రావటం - మనల నిరుత్సాహ పరచటం కాక ఉత్సాహపరచవలసిన అంశం. ఆసియా విప్లవాలు కూడా బూర్జువా లిబరల్ సిద్ధాంతాల పనికిమాలిన తనాన్ని స్పష్టపరుస్తున్నవి! ప్రజాస్వామిక ప్రజల స్వతంత్ర పాత్రను - అన్ని రకాల బూర్జువా నాయకులకు, కార్మిక వర్గానికి మధ్య ఉన్న తేడాను స్పష్టపరుస్తున్నవి. ఆసియా యూరోపు ఈ రెండింటిలోను వచ్చిన అనుభవం తర్వాత కూడ యిప్పటికీ ఎవ్వరైనా, వర్గ రాహిత్య రాజకీయాలు, వర్గరాహిత్య సోషలిజాన్ని గురించి మాట్లాడుతుంటే వారిని పంజరములో పెట్టి ఆస్ట్రేలియా కంగారు జంతువు ప్రక్కపెట్టి ప్రదర్శించవలసి ఉంటుంది".

### నూతన వ్యూహం, నూతన ఎత్తుగడ

ఈ విప్లవ దశ ప్రారంభంలో లెనిన్ అంతర్జాతీయ కార్మిక ఉద్యమ రంగం మీదికి వచ్చాడు. కార్మిక ఉద్యమంలోని రివిజనిస్టుల వాదనలను చీల్చి చెండాడుటకు పూనుకున్నాడు. మార్క్సిస్టు మూల సూత్రాలను సామ్రాజ్యవాద దశకు అన్వర్తించి వాటిని సృజనాత్మకంగా అభివృద్ధి చేసి కార్మికవర్గ విప్లవాలు జయప్రదమగుటకు అవసరమైన నూతన వ్యూహము, ఎత్తుగడలను ప్రపంచ కార్మికుల ముందుంచాడు.

మార్క్సు ఎంగెల్సులు పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందుతున్న కాలానికి చెందినవారు. లెనిను సామ్రాజ్యవాద దశకు, విప్లవాల దశకు చెందినవారు. మార్క్సుసిద్ధాంతాలను సామ్రాజ్యవాద దశకు అన్వర్తించి అమలుపరచవలసిన బాధ్యత లెనిన్‌ది.

మార్క్సు, పెట్టుబడిదారీ విధానం బాగా అభివృద్ధి చెందిన దేశాల్లో మొదటి కార్మిక విప్లవాలు వస్తాయన్నాడు. మార్క్సు - పారిస్ కమ్యూన్‌లో కార్మిక నియంతృత్వాన్ని బీజరూపంలో చూడగలిగాడు. లెనిన్ కార్మిక నియంతృత్వాన్ని సాధించుట కవసరమైన వ్యూహము-ఎత్తుగడలు పన్ని, దాన్ని సాధించి, స్థాపించి, సోషలిజం నిర్మించవలసి వుంది. మార్క్సు కార్మిక విప్లవానికి అవసరమైన శాస్త్రీయ సిద్ధాంత పునాదిని సృష్టించారు. లెనిన్ వాటిని సృజనాత్మకంగా అభివృద్ధి చేసి కార్మిక విప్లవాన్ని జయప్రదం చేయవలసి వుంది.

లెనిన్ సిద్ధాంతాల గురించి కామ్రేడ్ స్టాలిన్ అన్న మాటలివి :

"సామ్రాజ్యవాద దశకు, కార్మిక విప్లవాల దశకు సంబంధించిన మార్క్సిజమే లెనినిజము. ఇంకా సూటిగా చెప్పాలంటే కార్మిక నియంతృత్వము యొక్క సిద్ధాంత - ఎత్తుగడలకు సంబంధించినదే లెనినిజము. మార్క్సు, ఏంగెల్సులు విప్లవానికి (కార్మికవిప్లవం) పూర్వమున్న కాలములో, సామ్రాజ్యవాదము పూర్తిగా అభివృద్ధి చెందని కాలంలో, కార్మిక విప్లవాలకు సమయం ఆసన్నంకాని సమయంలో తమ కార్యకలాపాలు సాగించారు. కాని మార్క్సు, ఏంగెల్సుల శిష్యుడైన లెనిన్, అభివృద్ధి చెందిన సామ్రాజ్యవాద దశలో, కార్మిక విప్లవాలు చెలరేగుతున్న సమయంలో, ఒక దేశంలో కార్మిక విప్లవం జయప్రదమైన సమయంలో బూర్జువా ప్రజాస్వామికాన్ని తుత్తునియలు చేసి కార్మిక ప్రజాస్వామికం సోవియట్ల రూపంలో ఒక దేశంలో ఏర్పడిన కాలంలో పని చేశాడు...."

*(లెనినిజం సమస్యలు : స్టాలిన్... పేజీ 16)*

కాట్స్కీ మొదలగు రివిజనిస్టులకు వ్యతిరేకంగా లెనిన్ పైనుండి క్రిందివరకు సంపూర్ణ ఐక్యత కల్గిన నూతన కమ్యూనిస్టుపార్టీ నిర్మాణాన్ని రూపొందించాడు. సామ్రాజ్యవాద యుద్ధాన్ని కార్మికవర్గం అంతర్యుద్ధంగా మార్చాలనే సూత్రీకరణ రూపొందించాడు. జారిస్టు రష్యా సామ్రాజ్యవాద గొలుసులో అత్యంతబలహీనమైన లింకు అని, అక్కడ విప్లవం జయప్రదమై తీరుతుందని హెచ్చరించి తన కాలాన్ని, శక్తినంతా అందుకు వినియోగించాడు.

## 1905 రష్యా విప్లవం

లెనిన్ ఊహించినట్లుగానే 1905లో రష్యాలో వచ్చిన బూర్జువా ప్రజాస్వామిక విప్లవం పెట్టుబడిదారీ సమాజాన్ని ఊపివేసింది. సోషలిస్టు విప్లవాలకు సమయమాసన్నమైందని హెచ్చరించింది.

రష్యాలో పెరుగుతున్న ప్రజా అసంతృప్తిని ప్రక్కదార్లు పట్టించడానికి జారు చక్రవర్తి మంచూరియా సమస్యపై జపాన్‌తో 1904లో యుద్ధానికి దిగాడు. ఈ యుద్ధంలో జారు చక్రవర్తి సైన్యాలు ఘోర పరాజయాన్ని పొందాయి. ఈ యుద్ధం రష్యాలో 1905 విప్లవానికి దోహదం చేసింది. లెనిన్ నాయకత్వాన రష్యన్ బోల్షివిక్కులు ఈ విప్లవపోరాటానికి నాయకత్వం వహించారు.

రష్యన్ సోషల్ డెమొక్రాటిక్ పార్టీలో రివిజనిస్టు ధోరణులకు ప్రతిబింబంగా నున్న మెన్షివిక్కులకూ, మార్క్సిస్టు మూల సూత్రాలకు కట్టుబడియున్న లెనిన్ అనుచర వర్గ బోల్షివిక్కులకూ ఘర్షణ తీవ్రమైన

1903లోకి ఆ పార్టీ రెండుగా చీలింది. లెనిన్ నాయకత్వాన బోల్షివిక్కులు ప్రత్యేక పార్టీగా వ్యవహరించడం ప్రారంభమయ్యింది.

## రెండు ఎత్తుగడలు

1905 విప్లవంలో మెన్షివిక్కులు, బోల్షివిక్కులు రెండు పరస్పర విరుద్ధమైన వ్యూహము – ఎత్తుగడలు అవలంబించారు.

- ఈ విప్లవం బూర్జువా విప్లవం గనక అది బూర్జువా నాయకత్వం క్రిందనే అభివృద్ధి కావాలని, కార్మిక వర్గం అందుకు సహాయంచేసి జారిస్టు ప్రభుత్వాన్ని కూలద్రోయుటకు సహాయపడాలని మెన్షివిక్కుల వాదన. బోల్షివిక్కులు దీనిని తిరస్కరించారు. కార్మికవర్గ నాయకత్వం క్రింద మాత్రమే ఈ విప్లవం జయప్రదం కాగదలన్నారు.
- మెన్షివిక్కుల దృష్టిలో రైతాంగం విప్లవ వర్గంకాదు. కాని బోల్షివిక్కులు కార్మికవర్గ నాయకత్వం క్రింద కార్మిక – రైతు ఐక్యత సాధించనిదే విప్లవం జయప్రదం కాదని అన్నారు.
- మెన్షివిక్కులు బూర్జువా ప్రజాస్వామ్య విప్లవం జయం పొందిన తరువాత బూర్జువా నాయకత్వాన పెట్టుబడిదారీ విధానం సంపూర్తిగా అభివృద్ధి చెందుటకు అవసరమైన కాలాన్ని పెట్టుబడిదారీ వర్గానికివ్వాలన్నారు. బోల్షివిక్కులు దీన్ని తిరస్కరించారు. బూర్జువా విప్లవం జయప్రదమైన వెంటనే సోషలిస్టు విప్లవాన్ని సాధించటానికి అవసరమైన పోరాటాన్ని ప్రారంభించాలన్నారు.
- విప్లవాన్ని తప్పు మార్గాన పట్టించటానికి జారు చక్రవర్తి బూటకపు పార్లమెంటును ఏర్పరచుటకు వాగ్దానం చేస్తే మెన్షివిక్కులు దానికి అంగీకరించి పనిచేయాలన్నారు. బోల్షివిక్కులు దానిని తిరస్కరించారు. సాయుధ పోరాటం ద్వారా జారు చక్రవర్తిని అధికారం నుండి క్రూలదోయాలన్నారు.

1905 జనవరి 9 (బ్లడీ సన్‌డే)న ఒక మత గురువు నాయకత్వాన వేలాది కార్మికులు తమ కోర్కెలు నివేదించుటకు ఉరేగింపుగా వెళ్ళితే జారు సైన్యం ఈ కార్మికులపై అమానుషంగా కాల్పులు సాగించింది. దీనితో ప్రారంభమైంది 1905 రష్యా విప్లవం.

క్రమంగా ముఖ్యమైన పట్టణాలకంతా ప్రాకింది. అనేక పట్టణాలలో కార్మికులు రాజకీయ సమ్మెలు చేశారు. ఒడెస్సాలో "పోటెంకిన్" ఓడకు చెందిన నావికా సైన్యం తిరుగుబాటు చేసింది. విప్లవం పట్టణాల నుండి పల్లెలకంతా విస్తరించింది. రైతాంగం భూస్వాముల భూములను ఆక్రమించుట ప్రారంభమైంది. 1905 డిశంబరులో మాస్కో కార్మికవర్గం తిరుగుబాటు చేసింది. వీధి పోరాటాలు జరిపారు. బారికేడ్లు నిర్మించారు. కాని ఈ తిరుగుబాటు అతి క్రూరంగా అణచివేయబడింది. దీనితో 1905 విప్లవం సమాప్తమైందని చెప్పవచ్చు.

దీని తరువాత రష్యా విప్లవోద్యమాన్ని అణచుటకు జారు చక్రవర్తి అతి క్రూరమైన నిర్బంధాన్ని ప్రయోగించాడు. బోల్షివిక్కులు గెరిల్లా పోరాటం ద్వారా విప్లవోద్యమాన్ని కాపాడుకుంటూ వచ్చారు.

## ఓటమికి కారణాలు

- కార్మిక – రైతు ఐక్యత బలంగా సాధించబడలేదు. మెజారిటీ రైతాంగానికి ఇంకా జారు చక్రవర్తిపై భ్రమలున్నాయి.
- సైనికులలో కొన్ని తిరుగుబాట్లు వచ్చినా మెజారిటీ సైన్యం జారు చక్రవర్తివైపునే నిల్చింది.
- కార్మికవర్గమంతా కూడా ఒక్కసారిగా విప్లవం లోనికి రాలేదు.
- కార్మికవర్గం బోల్షివిక్కులు, మెన్షివిక్కుల మధ్య చీలివుంది. మెన్షివిక్కులు విప్లవపోరాటాన్ని నీళ్ళు గార్చారు.
- 1905 సెప్టెంబరు రష్యా – జపాను శాంతి సంధి ఆంతరంగికంగా జారు చక్రవర్తి నిలద్రొక్కు కోవటానికి ఉపయోగపడింది.

మెన్షివిక్కులకూ, బోల్షివిక్కులకూ పోరాట రూపాన్ని గురించి, ఎత్తుగడల్ని గురించి, వ్యూహాన్ని గురించి, రష్యాలో వచ్చిన అభిప్రాయభేదాలే రెండవ ఇంటర్నేషనల్‌లో కూడా ప్రారంభమైనాయి.

సామ్రాజ్యవాద వ్యవస్థలోని అతర్గత వైరుధ్యాలు తీవ్రమయ్యాయి. ప్రపంచపునర్విభజనకు సామ్రాజ్యవాద దేశాల కూటముల మధ్య ఘర్షణ తీవ్రమైంది. తత్ఫలితంగా జర్మనీ దాని మిత్రదేశాల కూటమి, ఇంగ్లండు దాని మిత్ర దేశాల కూటముల మధ్య 1914లో మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది.

దీనితో రెండవ ఇంటర్నేషనల్‌లో ఉన్న సిద్ధాంత అభిప్రాయభేదాలు మూడు స్పష్టమైన ధోరణులుగా వ్యక్తమైనవి.

- మితవాదపక్షం–మెజారిటీ–అభివృద్ధి నిరోధక ప్రభుత్వాలను బలపర్చుటకు పూనుకున్నాయి.
- మధ్యస్థ గ్రూపు–కాట్స్కీ అనుచరవర్గం–ఆచరణలో మితవాదవర్గానికి తోడ్పడుతూ వచ్చింది.
- అతివాద వర్గం – లెనిన్ అనుచర వర్గం – సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చి తమ దేశంలోని పెట్టుబడిదారీ ప్రభుత్వాన్ని కూలద్రోయుటకు పనిచేయాలన్నది.

మొదటి ప్రపంచ యుద్ధంతో రెండవ ఇంటర్నేషనల్‌లో ఇంత కాలం దాగియున్న మితవాద వర్గం, మధ్యస్థ గ్రూపులు దేశరక్షణ పేరిట సామ్రాజ్యవాద యుద్ధ ప్రభుత్వాలను బలపర్చుటకు పూనుకున్నాయి.

లెనిన్ ఈ విధానాన్ని తిరస్కరించాడు. సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చాలని పిలుపిచ్చాడు. ప్రతిదేశంలోని కార్మికవర్గం యుద్ధ ప్రభుత్వాలను కూలద్రోసి కార్మిక ప్రభుత్వాలను స్థాపించడమే ప్రపంచశాంతికి దారితీస్తుందన్నాడు.

దీనితో పెట్టుబడిదారీ వర్గానికి అమ్ముడుపోయిన రెండవ ఇంటర్నేషనల్ నుండి లెనిన్ అనుచర వర్గం విడివడి ప్రత్యేకంగా మార్క్సిస్టు సిద్ధాంత పునాదిపై ఆధారపడిన విప్లవ కమ్యూనిస్టు పార్టీలను నిర్మించుటకు పూనుకున్నది.

## 1917 నవంబరు 7 – రష్యా విప్లవం

సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చుటకు, జారు చక్రవర్తిని కూలద్రోయుటకు రష్యాలో బోల్షివిక్కులు తీవ్రమైన కృషి ప్రారంభించారు.

1917 ఫిబ్రవరిలో జారుచక్రవర్తి అధికారం కూలద్రోయబడినది. పెట్టుబడిదారీ వర్గాల నాయకత్వాన నూతన ప్రభుత్వం ఏర్పడింది.

ఈ విప్లవం జారు చక్రవర్తి ఫ్యూడల్ వర్గానికి వ్యతిరేకంగా సాగిన విప్లవం. పారిశ్రామిక పెట్టుబడిదారీ వర్గం, కార్మికవర్గం, మధ్యతరగతి వర్గం, వ్యవసాయ కూలీలు, రైతాంగం ఈ విప్లవాన్ని నడిపాయి.

ఈ విప్లవానికి నాయకత్వం పెట్టుబడిదారీ వర్గం చేతిలో ఉన్నది గనుక అధికారం వారికి హస్తగతమైంది. ఐతే ఎక్కడికక్కడ స్థానిక సోవియట్లు ఏర్పడ్డాయి. తత్ఫలితంగా దేశంలో ద్వంద్వాధికారం ఏర్పడింది. ఈ సోవియట్లలో కూడా మెన్షివిక్కులది మెజారిటీ. దేశంలో ఆనాడు తీవ్రస్థాయిలో ఉన్న పెటీబూర్జువా వాతావరణం ఇందుకు కారణమైంది.

లెనిన్ ఫిబ్రవరిలో ఏర్పడిన ప్రభుత్వం బూర్జువా ప్రభుత్వమనీ అది యుద్ధాన్ని అంతం చేయజాలదని, అది యుద్ధాన్ని కొనసాగించే ప్రభుత్వమనీ, కార్మికవర్గం దానితో సహకరించ కూడదనీ హెచ్చరించాడు. పెట్టుబడిదారీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవసాయ కూలి, పేద, మధ్య తరగతి రైతాంగాన్ని, మధ్యతరగతి ప్రజలను, కార్మికవర్గం తన నాయకత్వాన సమీకరించి పెట్టుబడిదారీ ప్రభుత్వాన్ని కూలదోయాలన్నాడు. సోషలిస్టు విప్లవాన్ని సాధించాలన్నాడు.

అనుభవం ద్వారా మెజారిటీ కార్మికవర్గం, మెజారిటీ రైతాంగం, మెజారిటీ సైన్యం, మెజారిటీ సోవియట్లు బోల్షివిక్కులవైపు వచ్చాయి.

1917 నవంబరు 7న రష్యాలో సోషలిస్టు విప్లవం జయప్రదమైంది. ప్రపంచంలో మొట్టమొదటి కార్మిక నియంతృత్వ ప్రభుత్వ స్థాపన జరిగింది.

## విప్లవ విజయానికి కారణాలు

- రష్యా బూర్జువా వర్గం ఆర్థికంగా, రాజకీయంగా చాలా బలహీనపడింది. అది యుద్ధ పాలసీని కొనసాగించుట వల్ల మెజారిటీ ప్రజల సానుభూతిని కోల్పోయింది.
- విప్లవ చైతన్యం కల్గిన కార్మికవర్గం విప్లవానికి నాయకత్వం వహించింది. మెజారిటీ వ్యవసాయ కూలీలను, పేద రైతాంగాన్ని తనకండగా సమీకరించుకోగల్గింది.
- ఉక్కు శిక్షణ గల్గిన బోల్షివిక్కు పార్టీ కార్మికవర్గ నాయకుడిగా ముందుకు వచ్చింది.
- ప్రపంచ యుద్ధ పరిస్థితి – సామ్రాజ్యవాద దేశాలు ఒకదానితో ఒకటి యుద్ధం చేసుకుంటున్న పరిస్థితి, రష్యాలో సోషలిస్టు విప్లవం జయప్రదం కావటానికి తోడ్పడింది.

# నాల్గవ దశ

# 1917 రష్యా విప్లవం నుండి 1949 చైనా విప్లవం వరకు

సోవియట్ రష్యాలో కార్మికవర్గ విప్లవం జయప్రదమైనప్పటికీ పశ్చిమ యూరోపు దేశాల్లో రివిజనిస్టుల ద్రోహం వల్ల, బలమైన కమ్యూనిస్టు ఉద్యమాలు లేకపోవటంవల్ల కార్మికవర్గ విప్లవాలు విఫలమయ్యాయి.

మొదటి ప్రపంచ యుద్ధ ఫలితంగా, సోషలిస్టు ప్రభుత్వం ఏర్పడటంతో పెట్టుబడిదారీ విధానం సాధారణసంక్షోభంలో ప్రవేశించింది. ఇది పెట్టుబడిదారీ విధానంలోని వైరుధ్యాల నన్నిటినీ అతి తీవ్ర స్థాయికి పెంచింది. సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాల పరిష్కారానికి, పెట్టుబడిదారీ వ్యవస్థను ముంచుకు వస్తున్న సాధారణ సంక్షోభాన్నుండి బయట పడడానికి సామ్రాజ్యవాదులు సోవియటు యూనియనుపై దాడి చేయుటకు పూనుకున్నారు.

సోవియట్ యూనియనులోని ఆంతరంగిక అభివృద్ధి నిరోధకశక్తులు అంతర్జాతీయ సామ్రాజ్యవాదుల సహకారంతో సోషలిస్టు ప్రభుత్వాన్ని కూలద్రోయుటకు పూనుకున్నారు.

ఈ పరిస్థితుల్లో సోవియటు యూనియన్‌ను జాతీయ, విజాతీయ అభివృద్ధి నిరోధక శక్తుల నుండి సోషలిస్టు ప్రభుత్వాన్ని కాపాడుకుంటూ సోషలిస్టు సమాజాన్ని నిర్మించుకోవలసి వుంది.

సోషలిస్టు ప్రభుత్వాన్ని రక్షించుకుంటూనే యూనియను విప్లవ సందేశాన్ని ప్రపంచమంతటా వ్యాప్తి చేయడానికి ప్రపంచ కార్మికోద్యమానికి అవసరమైన సిద్ధాంత, రాజకీయ, ఆచరణ, నాయకత్వాన్ని అందజేయవలసి వుంది.

ప్రపంచ కమ్యూనిస్టు వుద్యమానికి నాయకత్వం వహించి బలమైన కమ్యూనిస్టు పార్టీల నిర్మాణానికి తోడ్పడవలసి వుంది.

జర్మనీ, బల్గేరియా, హంగరి మొదలైన దేశాల్లో కార్మికవర్గ విప్లవాలు వచ్చాయి. కాని రివిజనిస్టుల ద్రోహంవల్ల ఆ విప్లవాలు జయప్రదం కాలేకపోయాయి.

ఈలాంటి విప్లవ వాతావరణంలో 1919లో మూడవ ఇంటర్నేషన్‌లు పైన చెప్పిన కర్తవ్యాలు నిర్వహించుటకు స్థాపించబడింది.

మూడవ ఇంటర్నేషనల్ వివిధ దేశాలలో మార్క్సిజం సిద్ధాంతంపై ఆధారపడి కమ్యూనిస్టు పార్టీల నిర్మాణానికి తీవ్రంగా కృషి చేసింది. అందుకవసరమైన సిద్ధాంత, నిర్మాణ అనుభవాన్ని అందజేసింది. ఈ దశలో కమ్యూనిస్టులలో ఒక అతివాదవర్గం – విప్లవ పరిస్థితులు వెనక్కు తగ్గిన పరిస్థితుల్లో, ట్రేడ్ యూనియను కార్యకలాపాల్లో, పార్లమెంటులో పాల్గొనకూడదనే తప్పుడు సిద్ధాంతాలను ముందుకు తెచ్చింది. లెనిను వీటిని తీవ్రంగా ఖండించాడు.

ఈ దశలో, వలస, అర్ధవలస దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు ఏర్పడి పని చేశాయి. జాతీయోద్యమాలు విజృంభించాయి. ఈ దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీలు జాతీయోద్యమాన్ని తీవ్రపరుచుటకు పూనుకున్నాయి. ఈ కృషిలో చైనాలో కమ్యూనిస్టు పార్టీ ఘనమైన విజయాలు సాధించి, బలమైన శక్తిగా అభివృద్ధిచెందింది.

1924లో లెనిను మరణించాడు. ఈ దశకు సంబంధించిన అంతర్జాతీయ కర్తవ్యాలను స్టాలిను నాయకత్వాన మూడవ ఇంటర్నేషనల్ నిర్వహించింది.

అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాన్ని అభివృద్ధి చేయుటకు 1928లో జరిగిన 6వ కాంగ్రెస్ థీసిసు (వలస దేశాల థీసిసు) ఎంతగానో దోహదమిచ్చింది.

మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత పశ్చిమ యూరోపులో వచ్చిన విప్లవాలన్నీ విఫలం కావటంతో పెట్టుబడిదారీ వ్యవస్థ తాత్కాలికంగా నిలద్రొక్కుకుంది. దానితో పెట్టుబడిదారీ వ్యవస్థకు యిక సంక్షోభాలు ఉండవని, క్రమానుగత అభివృద్ధికి తిరిగి అవకాశము ఏర్పడిందని బూర్జువా రాజకీయ నాయకులు, రివిజనిస్టులు మరొకసారి వాదనలు ముందుకు తెచ్చారు.

1928లో మూడవ ఇంటర్నేషనల్‌కు చెందిన 6వ కాంగ్రెస్ ఈ తప్పుడు వాదనల నన్నిటిని తూర్పార బట్టింది. సామ్రాజ్యవాదం సంక్షోభంలో ప్రవేశించిందని, దానికి సంక్షోభాలు తప్పవని విప్లవాలు తప్పవని, పెట్టుబడిదారీ వ్యవస్థ కూలిపోక తప్పదని హెచ్చరించి, ప్రపంచ కమ్యూనిస్టు పార్టీలకు ఈ కాలానికవసరమైన ఎత్తుగడలను రూపొందించింది.

అదే విధంగా వలసదేశాల పరిస్థితిని సమీక్షించి జాతీయోద్యమాలను తీవ్రపరచడానికి కమ్యూనిస్టు పార్టీ అవలంబించవలసిన ఎత్తుగడలను రూపొందించింది.

1929–33 సంవత్సరాలకాలంలో వచ్చిన ప్రపంచ ఆర్థికసంక్షోభం బూర్జువా రాజకీయవేత్తల అంచనాలన్నిటినీ వమ్ముచేసింది. కమ్యూనిస్టుల అంచనా ఎంత సరైందో రుజువు పరిచింది.

సోవియట్ రష్యాలో ఎలాంటి సంక్షోభాలు లేకుండా సోషలిస్టు సమాజం అభివృద్ధి చెందుతుంటే, పెట్టుబడిదారీ సమాజం ఎలాంటి సంక్షోభాలకు గురైందో ఎత్తిచూపింది. ఈ దశలో 3 ప్రత్యేక ఘటనలు పేర్కొనాలి.

- సోవియట్ యూనియనులో ట్రాట్స్కీ, బుఖారిన్ సిద్ధాంతాలను ఓడించి, స్టాలిన్ నాయకత్వాన సోషలిస్టు సమాజ నిర్మాణానికి పంచవర్ష ప్రణాళికల కార్యక్రమం ప్రారంభమయింది.
- పశ్చిమ యూరోపులో ఆర్థిక సంక్షోభ దుష్ఫలితాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం విస్తృతమైన పోరాటాలకు పూనుకున్నది.
- చైనాలో చాంగ్ కై షేకు ద్రోహానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ, నాయకత్వాన దక్షిణ చైనాలో విముక్తి ప్రాంతాన్ని ఏర్పరచి, సాయుధ పోరాటం ప్రారంభమయింది. దక్షిణ ప్రాంతములో ఈ విముక్తి ప్రాంతాన్ని రక్షించుకోలేని పరిస్థితి ఏర్పడితే 1934లో ఎర్రసైన్యం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన 6,000 మైళ్ళదూరం నడిచి ఉత్తర చైనా చేరి విముక్తి ప్రాంతాన్ని ఏర్పరచుకొని తన పోరాటాన్ని ప్రారంభించింది.

## ఫాసిజం

1929లో ప్రారంభమయిన సంక్షోభం జర్మనీలో విప్లవ పరిస్థితులను తీవ్రపరచింది. కమ్యూనిస్టు పార్టీ కార్మికవర్గాన్ని విప్లవపోరాటాల వైపు మళ్ళించడానికి తీవ్రంగా కృషి చేసింది. కాని మెజారిటీ కార్మికవర్గం ఇంకా సోషల్ డెమోక్రట్ల చేతుల్లో వుంది. వీరు అడుగడుగునా కార్మికవర్గ పోరాటాలను నీరుగారుస్తూ పెట్టుబడిదారీ వర్గంతో రాజీపడుతూ వచ్చారు. పెట్టుబడిదారీవర్గం – హిట్లరు ఫాసిస్టు మూకకు సహాయమిచ్చి పార్లమెంటరీ విధానాన్ని రద్దుచేసి, 1933 జనవరి 30వ తేదీన హిట్లరును అధికారానికి తెచ్చింది.

హిట్లరు ఫాసిస్టుప్రభుత్వం, జర్మనీ ప్రజాతంత్ర ఉద్యమాన్ని కార్మిక, కమ్యూనిస్టు ఉద్యమాన్ని అణచి వేసింది. వేలాదిమందిని ఉరితీసింది.

తన పార్లమెంటు భవనాన్ని తానే తగుల బెట్టుకొని, డిమిట్రావ్ తదితర కమ్యూనిస్టు నాయకులపై కుట్రకేసు బనాయించింది. ప్రపంచవ్యాప్త ఆందోళన డిమిట్రావ్ విడుదలను సాధించగల్గింది.

## ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటం

ప్రపంచ సామ్రాజ్యవాదులంతా హిట్లరు, ముస్సోలినీల ఫాసిస్టు ప్రభుత్వాలను, జపాను ప్రభుత్వాన్ని ప్రోత్సహించి రష్యాపై యుద్ధానికి తలపడేలాగు చెయ్యాలని కుట్రలు ప్రారంభించారు.

1931లోనే జపాను మంచూరియాపై యుద్ధం ప్రకటించింది. దానిని ఆక్రమించింది.

1935లో ఇటలీ అబిసీనియాపై యుద్ధాన్ని ప్రకటించింది.

హిట్లరు మారణాయుధాలతో కొత్త యుద్ధ ప్రయత్నాలు తీవ్రపరిచాడు.

ఇంగ్లండు, ఫ్రాన్సు, అమెరికా దేశాల ప్రభుత్వాలు యిందుకు దోహదమిచ్చాయి.

పెరుగుతున్న ఫాసిజానికి వ్యతిరేకంగా, మరొక యుద్ధ ప్రయత్నాలకు వ్యతిరేకంగా, ప్రజాస్వామిక వాదులందరినీ కూడగట్టి పోరాటాలకు ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం పూనుకున్నది.

1935లో మూడవ అంతర్జాతీయ సంస్థ 7వ కాంగ్రెసు – ఫాసిజం వర్గ స్వభావాన్ని స్పష్టపరిచి ప్రజాస్వామికవాదులందరినీ ఐక్యపరచి, ఐక్య సంఘటన ఎత్తుగడల ద్వారా యుద్ధ ప్రయత్నాలను ప్రతిఘటించమని పిలుపిచ్చింది.

ఈ పోరాట పిలుపునందుకొని వివిధ దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీలు బలమైన ప్రజాతంత్ర ఉద్యమ నిర్మాణానికి పూనుకున్నారు. అందులో ఈ క్రింది చారిత్రక ప్రాముఖ్యత కల్గిన ఘటనలు పేర్కొనదగినవి.

- 1936లో ఫ్రాన్సులో ప్రజాతంత్ర శక్తులు కలిసి పాపులర్ ఫ్రంటు ప్రభుత్వ మేర్పడింది. కమ్యూనిస్టు పార్టీ ఈ ప్రభుత్వాన్ని బలపరచింది.
- 1936లో స్పెయిన్‌లో కమ్యూనిస్టు పార్టీతో సహా యితర ప్రజాతంత్ర పార్టీలన్నీ కలిసి రిపబ్లికన్ ప్రభుత్వాన్ని ఏర్పరచాయి. ఆ ప్రభుత్వాన్ని కూలద్రోయుటకు ఫ్రాంకో తిరుగుబాటు ప్రకటించాడు. హిట్లర్, ముస్సోలినీ ప్రభుత్వాలు అతడికి అండగా నిలిచాయి. ఫ్రాన్సు, ఇంగ్లాండు, అమెరికాలు తటస్థం పేరిట స్పానిష్ రిపబ్లికన్ ప్రభుత్వానికి ద్రోహం చేశాయి. సోవియటు ప్రభుత్వం, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం మాత్రమే స్పానిష్ రిపబ్లికన్ ప్రభుత్వానికి అండగా నిలిచాయి. స్పానిష్‌రిపబ్లిక్ ఒంటరిగా వీరోచితంగాపోరాడింది. కాని తర్వాత కూలద్రోయబడింది. ఫ్రాంకో గద్దెనెక్కాడు.
- చైనాలో కమ్యూనిస్టు పార్టీ, కొమింటాంగు పార్టీ తనపై సాగించుతున్న అంతర్యుద్ధాన్ని అంతం చేయాలని, జపాను దురాక్రమణు ఐక్యంగా ప్రతిఘటించాలని దేశమంతా బ్రహ్మాండమైన ఉద్యమాన్ని నిర్మించింది. కొమింటాంగు కమ్యూనిస్టు పార్టీతో కలిసి జపాను దురాక్రమణను ప్రతిఘటించుటకు అంగీకరించక తప్పలేదు.
- రష్యాలో సోషలిస్టు సమాజ నిర్మాణాన్ని విచ్ఛిన్నం చేసి కూలద్రోయటానికి కుట్రలు పన్నుతున్న

# నరహంతకుని నికృష్టపు చావు అమెరికన్ సామ్రాజ్యవాదపు నీచమైన కుటిలత్వం!

**1984** డిసెంబర్ 2-3 తేదీల అర్ధరాత్రి భోపాల్‌లోని యూనియన్ కార్బయిడ్ కంపెనీ ఆవరణ నుండి టన్నులకొద్దీ మిథైల్ ఐసోసైనేట్ అనే విషవాయువు వెలువడటం వలన ఆ సమీప ప్రాంతాల్లో నివసిస్తున్న వారిలో 3,787 మంది, ఆ విషవాయువు ప్రభావ ఫలితంగా ఆ క్షణంలోనే మరణించారు. గర్భిణీలుగావున్న ఎందరో స్త్రీలకు గర్భస్రావాలయ్యాయి. వేలమందికి కంటిచూపు దెబ్బతింది. ఈ విషవాయువు సోకి ఆస్పత్రి పాలైన వారిలో 25,000 మంది మరణించారు. మరో 50 వేలకు మందిపైగా అంగవికలురయ్యారు. నాటినుంచి నేటివరకూ మూడు తరాలుగా యిప్పటికీ అక్కడ జన్యుపరమైన లోపాలతో శిశువులు జన్మిస్తున్నారు.

ఇంతటిస్థాయి భారీ మానవ హననానికి బాధ్యత అంతా, అమెరికాకు చెందిన బహుళజాతి సంస్థ యూనియన్ కార్బయిడ్ కార్పొరేషన్‌దీ-దానికి నాడు ఛైర్మన్‌గా వున్న వారెన్ ఆండర్‌సన్‌దీ.

ఉద్దేశ్యపూరితంగానే యూనియన్ కార్బయిడ్ కంపెనీ, ఆ రాత్రి మిథైల్ ఐసోసైనేట్ ప్రభావం మానవులపై ఎలా వుంటుందో తెలుసుకోవటంకోసం దానిని విడుదల చేసిందనీ; సామ్రాజ్యవాద అమెరికాయొక్క రసాయన యుద్ధాల అవసరంకోసం, యిటువంటి దారుణప్రయోగానికి పాల్పడిందనీ భోపాల్ మారణకాండ జరిగిన ఆ రోజుల్లోనే, కొందరు ఆరోపించారు.

తర్వాతి కాలంలో ఆ వాదనను కప్పిమేస్తూ, కంపెనీకి ఎక్కువ లాభాలను ఆర్జించి పెట్టడంకోసం, కావాలనే యు.సి.సి. భోపాల్ ఫ్యాక్టరీలో, కనీస భద్రతా ప్రమాణాలను పాటించలేదనీ, అండర్సన్ ఎరుకతోనే, భోపాల్ ఫ్యాక్టరీలో, అమెరికాలోని ఫ్యాక్టరీలలో వాడి పారేసిన భద్రతా పరికరాలను బిగించటం జరిగిందనీ, అందువలన విషవాయువు 'లీకు' అయిందనే వాదన బలంగా ముందుకు తీసుకురాబడింది. ఆ రకంగా భోపాల్ కర్మాగారంలో సామ్రాజ్యవాద అమెరికాకు అవసరమయిన రసాయన యుద్ధఅవసరాలకోసం ప్రయోగం చేయబడిందనే కీలకమైన అంశంపై ఆలోచించకుండా, నాసిరకపు భద్రతా ఏర్పాట్లు జరిగాయనే వైపుకు ప్రజల- అన్వేషకుల దృష్టిని చాకచక్యంగా కేవలం అండర్సన్ - యు.సి.సి.లవైపే గురిపెట్టే విధంగా మళ్ళించటం జరిగింది. ఇందువలన సమస్య అంతా యు.సి.సి. నుండి పరిహారాన్ని పొందటం అన్న విషయానికే పరిమితంజేసి ప్రక్కదారి పట్టించబడింది.

యు.సి.సి భోపాల్ ఫ్యాక్టరీలో ఎంతచక్కటి, పటిష్టమయిన భద్రతా వ్యవస్థను ఏర్పాటుచేసినా భారత దేశంలోని, ఆ ఫ్యాక్టరీలోగల దేశీయ సూపర్‌వైజర్లు - మేనేజర్లు భద్రతా ప్రాముఖ్యతను సక్రమంగా అర్థం చేసుకోకుండా, యధాలాపంగా నాటి రాత్రి ప్రవర్తించారని, ప్రస్తుతం భోపాల్ యూనియన్ కార్బయిడ్ ఫ్యాక్టరీ ఆవరణను కొనుగోలు చేసిన 'డౌ' కెమికల్స్ కంపెనీ ఆ కాలంలోనే యిద్దరు ఫ్రెంచి రచయితలను పురమాయించి వారిచేత, ఈ విషవాయువు బయటకు వెలువడటానికి గల కారణంపై, అటువంటి అబద్ధపు నిర్ధారణను చేయిస్తూ ఒక కథా - కథన రూపంలోవున్న పుస్తకాన్ని రాయించి విస్తృతంగా దాన్ని అన్ని భాషలలోనూ ప్రచురింప చేయించింది.

అయినా నాటి రాత్రి జరిగిన మారణహోమం నరమేధమే! సామూహిక నరహత్యే! ఇది మానవ చరిత్రలోనే అత్యంత దారుణమైనది. హేయమైనదీ. అమానుషమైనదీ. అందువలన యిందుకు మొత్తంగా యూనియన్ కార్బయిడ్ కంపెనీ, దానికి నాటి ఛైర్మన్ అయిన వారెన్ అండర్సన్‌లు సమిష్టిగానూ, విడిగానూ కూడా బాధ్యులైన నేరస్తులే! ఇంతటి సామూహిక నరహత్యకు పాల్పడిన అండర్సన్‌ను బహిరంగంగా వురితీసి వున్నా కూడా - అది అతడూ-అతడి సంస్థ యు.సి.సి.లు జరిపిన మారణకాండకు విధించాల్సిన శిక్ష కన్నా తక్కువైనదే!

కానీ విచిత్రమేమిటంటే, యీ హత్యాకాండ జరిగిన, నాల్గోరోజున భారతదేశం వచ్చిన ఆండర్సన్‌ను, అప్పటికి ఆగ్రహోద్రేకులుగా వున్న దేశ ప్రజలను మభ్యపెట్టడంకోసం ఉత్తుత్తి అరెస్టు జరిపి, వెంటనే ఈ నరహంతకుడిని రాచమర్యాదలతో, సగౌరవంగా, క్షేమంగా రాజీవ్‌గాంధీ పాలనలోవున్న భారతదేశ ప్రభుత్వం ప్రత్యేక విమానం యిచ్చి, అమెరికాకు పంపివేసింది. ఆ రకంగా ఆ నర హంతకుడు ఎన్నడూ ఆ నరమేధానికి శిక్షకు గురి అవకుండా యిష్టపూర్వకంగానే భారత పాలకులూ, భారత బడాపారిశ్రామిక వర్గాలూ అతడ్ని తప్పించి వేశారు. అమెరికన్ సామ్రాజ్యవాదపు సేవకులుగా వున్న వీరు, ఆ సామ్రాజ్యవాదపు అవసరాలకు అనుగుణంగానే ఆ తర్వాతి కాలంలో కూడా వ్యవహరించారు.

కొన్నాళ్ళు 'పరిహార' వసూలు ప్రహసనం నడిపించి, ఆఖరుకు కేవలం 470 మిలియన్ల డాలర్ల మొత్తాన్ని యు.సి.సి. నుండి భిక్షగా తీసుకొని, ఆ మొత్తంతోటే బాధితులందరినీ సంతృప్తి పరుస్తామనే వాగ్దానంతో, భారత ప్రభుత్వం ఆ నరమేధపు కేసును రద్దుచేసుకోవటానికి, సుప్రీంకోర్టు ద్వారా- సుప్రీం కోర్టును అంగీకరింపచేసి - భారత ప్రభుత్వం అంగీకరించింది.

కానీ, అందుకు దేశంలో భారీ ప్రజా వ్యతిరేకత వ్యక్తంకావటంతో, 'పరిహార' పెంపుదలకోసం అంటూ కేవలం 1.2 బిలియన్ల డాలర్ల అదనపు 'పరిహారం' కోసం కేసులు (కోర్టుల్లో) వేసే నాటకాన్ని భారత ప్రభుత్వం ఆడింది. ఈ క్రమంలోనే నేరస్తుడు ఆండర్సన్‌ను, న్యాయవిచారణకోసం భారతదేశానికి అప్పగించమని కోరినట్లు లేఖలురాసిన నాటకం ఆడింది. కానీ ఆచరణలో యు.పి.ఎ. ప్రభుత్వం కానీ, ఎన్.డి.ఎ. ప్రభుత్వంకానీ ఎన్నడూ ఈ విషయమై పట్టుపట్టిన దాఖలాలు లేవు. అమెరికా ప్రభుత్వం ఎన్నడూ భారతప్రభుత్వపు లేఖలను లక్ష్య పెట్టలేదు, పట్టించుకోలేదు. ఆండర్సన్‌ను భారత దేశానికి అప్పజెప్పడానికి ఎన్నడూ అణుమాత్రంకూడా అంగీకరించలేదు.

ఇందువలన ఆండర్సన్ అమెరికాలోనే సురక్షితంగా, అమెరికాలోని కోర్టుల సమన్లు (సబ్‌పియానోలు) అందుకోవటానికి దొరకకుండానే, అమెరికా ప్రభుత్వ సాయంతోనే తప్పించుకొని తిరుగుతూ, హాయిగా వెరోబీచ్, గ్రీన్‌లిచ్, కన్నెక్టికట్, న్యూయార్కులోని బ్రిడ్జిహాంప్టన్‌లోగల తన యిళ్ళలో దాగుడుమూతలు ఆడుతూ 92వ ఏటిదాకా జీవించాడు. ఆఖరుకు రహస్యంగానే సెప్టెంబరు 29న మరణించాడు. అతి అప్రతిష్టా పూర్వకమయిన నికృష్టపు చావుచచ్చాడు. అక్టోబర్ 31న న్యూయార్కు టైమ్స్ పత్రిక అతడి చావు వార్తను వెల్లడించేదాకా, నిర్ధారించేదాకా, అతడి చావు వార్త ప్రపంచానికి తెలియనంతటి అప్రతిష్టా కరమైన చావు చచ్చాడు "వారెన్ ఆండర్సన్".

వారన్ అండర్‌సన్‌ను కేవలం ఒక నరహంతకుడైన వ్యక్తిగా పరిగణించటం వలన, అతడి రాక్షసత్వ-అమానుషత్వ దుర్మార్గంయొక్క లోతులను సక్రమంగా, స్పష్టంగా చెప్పినట్టవదు. అతడు నరరూపంలో వున్న అమానుష, దుర్మార్గ, రాక్షసత్వపు సామ్రాజ్యవాదం యొక్క - దుర్మార్గపు పెట్టుబడిదారీ వ్యవస్థయొక్క మూర్తీభవించిన వ్యక్తీకరణ. సామ్రాజ్యవాద అమెరికాయొక్క వంచనాపూర్వక స్వభావానికి ప్రతిరూపం. ఆ కారణంచేతనే అతన్ని నరహంతకుడంటున్నది. ఆ కారణంచేతనే అమెరికా ప్రభుత్వం అతణ్ణి చచ్చేవరకూ రహస్యంగా రక్షించింది. ఆ కారణంవల్లనే మన భారతదేశపు న్యాయవ్యవస్థ అతడ్ని 'గైర్హాజరయిన నేరస్తుడని' ప్రకటించినా, 'పారిపోయిన నేరస్తుడని' ప్రకటించినా అవి ఒట్టికూతలుగానే మిగిలిపోవటం. పేదవాడికోపం పెదవికి చేటన్నట్టు, సామ్రాజ్యవాద విదేశపెట్టుబడి పైననే ఆధారపడి, పరాధీనమైన దేశపు, ప్రభుత్వపు- న్యాయస్థానాల హుంకరింపులు, మేకపోతు గాంభీర్య ప్రకటనలేతప్ప, సామ్రాజ్యవాదపు అమెరికా ముందు ఎందుకు నిలుస్తాయి? వీటిని మనం 'కాగితపు పులుల' గర్జనలుగానే అర్థం చేసుకోవాల్సి వుంది.

నిజానికి 1984 డిసెంబరులో ఆండర్సన్‌ను అరెస్టుచేసినపుడే-అటు అమెరికా సామ్రాజ్య ప్రభువుల ప్రతిస్పందన ఎలావున్నా-భారత బడాపారిశ్రామిక వర్గాలూ, "అండర్సన్ అరెస్టు నిరంకుశమైనది" అనీ "హేతుబద్ధం - సమర్థనీయంకానిదనీ" వాదించటమే కాక, బడాపారిశ్రామికవేత్త అయిన జె.ఆర్.డి. టాటా తాను "ఈ అరెస్టును చూసి విభ్రమం పొందాననీ, ఎంతో దిగులు చెందానని'' ప్రకటించటంద్వారా, భారత బడా - పారిశ్రామిక వర్గం, సామ్రాజ్యవాదపు విదేశీ పెట్టుబడి దళారీలమనీ, వారి ప్రయోజనాలకోసం పాటుపడుతామనీ చాటుకోవటంతోపాటు, భారత దేశంలోని ప్రజలు సామూహిక హననానికి గురైనా అది, అంత తీవ్రంగా పట్టించుకోవాల్సిన విషయం కాదనే తమ వర్గస్వభావాన్ని స్పష్టంచేశారు. ఆ దళారీ బడాపెట్టుబడిదారీ వర్గాలకు ప్రతినిధిగావున్న నాటి రాజీవ్‌గాంధీయొక్క భారత ప్రభుత్వం, ఆ కారణంవల్లనే నరహంతక-నేరస్తుడు వారెన్ ఆండర్సన్‌ను రాజ లాంఛనాలతో, రాచమర్యాదలతో, ప్రత్యేక విమానమిచ్చి అతడి స్వదేశం అమెరికాకు సాగనంపింది.

నిజానికి యు.సి.సి.కి పలు పథకాలద్వారా సూపర్ లాభాలను గడించిపెట్టినవాడు ఆండర్సన్. అందువల్లనే అతడు ఈ నరమేధంలో ప్రధాన నేరస్తుడయ్యాడు.

ఈ సందర్భంలో మనం మరో విషయాన్ని కూడా తప్పక ఆలోచించాల్సిన అవసరం కనబడుతోంది. నాడు ఈ మానవ హననానికి గల బాధ్యతను తప్పించు కోవటం కోసం వాదిస్తూ, అమెరికన్ యూనియన్ కార్బయిడ్ కార్పొరేషన్ తనకు భారతదేశంలోనే అనుబంధ (సబ్సిడియరీ) సంస్థగా వున్న కార్బయిడ్‌లో కేవలం 51% మాత్రం వాటాలే వున్నాయని వాదించింది. అంటే యించుమించు యు.సి.సితో సమానంగా, ఈ కంపెనీలో భారతదేశపు వాటాదారులున్నారన్నమాట! అంటే ఈ మారణకాండలో ఈ వాటాదారులకూ యించుమించుగా సమాన బాధ్యత వుందన్నమాట! అంటే ఈ భారతీయ వాటాదారులు అండర్సన్‌తో సమానమైన నరహంతకులే నన్నమాట! విచిత్రం ఏమిటంటే ఈ గత 30 సంవత్సరాలుగా, ఈ భారతదేశపు వాటాదార్లు ఎవరు? అన్న ప్రశ్న గురించి ఎవరూ విచారించకపోవటం, చర్చను సాగించక పోవటం అన్నదే! వారి పేర్లు ఏవైనా వీరందరూ (బడా పారిశ్రామికవేత్తలు - బడా రాజకీయ నాయకులూ) ఆ సంస్థ (విదేశీ పెట్టుబడి) యొక్క దళారులనే అర్థమవుతోంది. సరీగ్గా ఈ కారణంచేతనే అటు పాలకుల్లోనూ, యిటు ప్రభుత్వంలోనూ, పాలక వర్గాలలోనూ భోపాల్ కేసును ఎంత తొందర్లో ముగించి వేద్దామా? అనే ఆతృతే కనబడుతూ వచ్చింది.

దేశభక్తులైన ఆర్థికవేత్తలూ, పరిశోధకులు ఈ కీలకమైన స్వదేశీ దళారీ అంశంపై యిప్పుడైనా దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ఆనాడు జరిగింది అలా వుంటే, తర్వాత భోపాల్ లోని కార్బయిడ్ ఫ్యాక్టరీ ఆవరణను కొనుగోలు చేసిన విదేశీ బడా కార్పొరేషను (డౌ) కంపెనీ - ఆ ఆస్థిని కొనుగోలుచేసిన దృష్ట్యా-యిప్పుడు ఆ మారణకాండకు బాధ్యత వహించాల్సి వుంది. అలా 'డౌ' కంపెనీని అందుకు బాధ్యురాల్ని చేయాలని దేశంలోనూ - అంతర్జాతీయంగానూ ప్రజాభిప్రాయం ద్వారా ఎంతో ఒత్తిడి వచ్చింది. ఈ సందర్భంలోనూ భారత బడా పారిశ్రామికవర్గం ప్రదర్శించిన వైఖరిని మనం ప్రత్యేకంగా గమనించాల్సి వుంది.

భారత బడా పారిశ్రామికవర్గానికి ప్రతినిధిగా వున్న పలు పారిశ్రామిక సంఘాలూ, ప్రత్యేకించి టాటా కంపెనీల ప్రస్తుత యజమాని అయిన రతన్‌టాటాలు, నాటి నరమేధానికి నేటి 'డౌ' కంపెనీని బాధ్యత చేయటం తగదనీ, కుదరదనీ బలంగా వాదించారు. భారతప్రభుత్వం అందుకు యిష్టపూర్వకంగా కూడా అంగీకరించింది. ఆ కారణం చేతనే, ఈరోజున 'డౌ' కంపెనీ భారతదేశంలో ఎంతో గౌరవంతో తన వ్యాపార కార్యకలాపాలను సాగించు కొంటుంది. అందుకు రక్షణ కవచంగా భారత ప్రభుత్వం, బడా పెట్టుబడిదారీ వర్గాలూ నిలబడ్డాయి.

ఎటొచ్చీ భోపాల్ ప్రజలూ, నాటి దుర్మార్గానికి బలి అయిన బాధితులే స్వదేశంలో ఎటువంటి న్యాయం లభించకుండా అనాథలుగా మిగిలిపోయారు. అది బి.జె.పి ప్రభుత్వం కానీయండి, యు.పి.ఎ ప్రభుత్వం కానీయండి, ఈ 30 సంవత్సరాలుగా వీరి గోడును పట్టించుకొన్న వారెవరూలేరు. ఎన్నికల సందర్భాలలో మాయమాటలు చెప్పి ఓట్లు దండుకొని, ప్రజలను అవసరం తీరేదాకా ఓడ మల్లయ్యలని ఆ తర్వాత 'బోడి మల్లయ్య' లన్నవారే అందరూ.

భోపాల్ పట్టణం చుట్టుపట్ల గల 3.5 కిలోమీటర్ల ప్రాంతంలో గల ప్రదేశాన్ని పరీక్ష జరిపిన, భారతీయ విషపదార్థాల పరిశోధనా సంస్థ (లక్నో) 2013 జనవరిలో యిచ్చిన రిపోర్టు ప్రకారం, ఆ ప్రాంతంలోని భూమీ, భూగర్భజలాలు యు.సి.సి. ప్రాంతం నుండి వెలువడుతున్న విషంతో కాలుష్యమయ్యాయని, క్యాన్సర్ కారక, జన్యుపరమైన లోపాలతో బిడ్డలు పుట్టే విషకారకాలతో ఆ ప్రాంతం అంతా నిండి పోయిందనీ యిప్పటికీ సాగుతున్న ముప్పును గురించి తెలియచేసింది.

ఇంతవరకూ ఆ ప్రాంతమంతా ఆవరించిన ఆ విషకారకాలను కానీ, ప్రస్తుతం డౌ కంపెనీ ఆధీనంలో వున్న భోపాల్ ఫ్యాక్టరీలో మిగిలివున్న విషపదార్థాలను కానీ తొలగించే చర్యలను అటు ప్రభుత్వాలుకానీ, యిటు డౌ కంపెనీ కాని ప్రారంభించలేదు. 'డౌ' కంపెనీ తనకు సంబంధం లేదు అంటూ యిప్పటికీ మొరాయిస్తూనే వుంది.

ఆరకంగా యీ 'విష ప్రమాదపు ముప్పు' కొనసాగుతూనే వుంది. బాధితులకు న్యాయం జరగటం అన్నది కల్ల అనేది తేలిపోయింది.

భోపాల్ దారుణానికి చెందిన సమస్యయొక్క స్వభావం యింతటి లోతుగా, యింతటి గాఢంగా వుంటే ఈరోజున కూడా ఆండర్సన్ మరణాన్ని పురస్కరించుకుని, భారత బడాపారిశ్రామిక వర్గాల ప్రతినిధిగావున్న 'బిజినెస్ స్టాండర్డు' పత్రిక తన 3 నవంబర్ 2014 నాటి సంపాదకీయంలో "ఇదంతా (ఆండర్సన్‌ను నేరవిచారణ చేయలేకపోవటం)భారత ప్రభుత్వంయొక్కా, భారత న్యాయవ్యవస్థయొక్కా బలహీనమైన స్థితికి, వైఫల్యాలకు తార్కాణంగా వుంది'' అని వ్యాఖ్యానిస్తూ యిందుకు కారణం 1984 నాటి రాజీవ్‌గాంధీ ప్రభుత్వ వైఫల్యాలు అన్న చిన్న విషయంగా కొట్టిపారేస్తోంది. పెట్టుబడిదారీ వ్యవస్థ సమర్థకులుగావున్న మేధావులూ, సంపాదకులూ తమ భాషాపాండిత్యాన్ని చూపెడుతూ కీలక సమస్యల్ని ఎంత చాకచక్యంగా ప్రక్కదారి పట్టించి, మరుగున పెడ్తారన్న దానికి ఈ సంపాదకీయ వ్యాఖ్య ఒక తాజా ఉదాహరణగా వుంటుంది.

కార్పొరేట్‌రంగం ఈ రోజున మోడీ పల్లకీ మోస్తూ, యిదేదో కాంగ్రెసు, బి.జె.పి. పార్టీ ప్రభుత్వాల సమర్థత-అసమర్థతల అంశంగా ఈ రకంగా తేల్చిపారేస్తోంది. ఇందులో యిమిడివున్న నిజమైన కీలక అంశం విదేశీ పెట్టుబడి భారతదేశంలో నిర్వహిస్తున్న విధ్వంసక పాత్ర కాగా, అది చెప్పకుండా దాటవేయటం జరుగుతోంది. మరో కీలక అంశం భారత బడా పెట్టుబడిదారీవర్గం, దాని చెప్పుచేతులలో వున్న భారత పాలకులూ విదేశీ పెట్టుబడికి వహిస్తున్న దళారీ పాత్ర. ప్రధానంగా చర్చించ బడాల్సినవి ఈ విషయాలు. కానీ ఈ మౌలిక విషయాలను దాచిపెట్టి, ద్వితీయ ప్రాధాన్యత గల అంశాలను చర్చలు చేయటంద్వారా భారత ప్రజలను ప్రక్కదారి పట్టించటం జరుగుతోంది.

ప్రస్తుతం అధికారంలో వున్న మోడీ అనేక ఆకర్షణీయ నినాదాలు, పిలుపులతో ప్రజలను రంజింపచేస్తూ మరోవేపు విదేశీ ప్రత్యక్ష పెట్టుడులకు ఎర్ర తివాచీ పరచి ఆహ్వానిస్తున్నాడు. భోపాల్‌లో జరిగిన దుర్మార్గం-మానవ హననం, పరిహార చెల్లింపు నిరాకరణ, నేరపూరిత కార్యకలాపాలకు శిక్షనుండి తప్పించుకొనే నైచ్యం, భారత న్యాయ వ్యవస్థనూ, సార్వభౌమాధికారాన్నీ ఖాతరు చేయక పోవటం - దాని పర్యవసానాల చేదు అనుభవం కళ్ళముందేవున్నా ఆ అనుభవ గుణపాఠాన్ని స్వీకరించ నిరాకరించి, యిష్టపూర్వకంగానే సామ్రాజ్యవాద విదేశీ పెట్టుబడులకు వెంపర్లాడి జోహుకుం అంటున్నాడు. మౌలికంగా పాలనా సమర్థతలో 'బలహీనులు'గా అభివర్ణించబడే యు.పి.ఎ. కాంగ్రెసు పాలకులకన్నా, 'సమర్థపాలకుడైన' మోడీ అవలంబిస్తున్న ఈ విధానాలు ఏవిధంగానూ భిన్నమైనవి కావనేది స్పష్టం. అందుకనే దేశంలోని బడా పారిశ్రామికశక్తులూ, బడాపెట్టుబడి దారులూ బ్రహ్మరథం పడుతున్నారు. ఈ విధానాలు నిశ్చయంగా దేశ వ్యతిరేకమైనవి, ప్రజావ్యతిరేకమైనవి.

నాటి యు.పి.ఎ. పాలకులుగానీ, నేటి బి.జె.పి. పాలకులు మోడీ కానీ, ఆఖరుకు మనతీర ప్రాంత జలాల్లోకి అక్రమంగా ప్రవేశించి, కేరళ సమీపంలో మన దేశపు మత్స్యకారులను నిర్దాక్షిణ్యంగా హత్య గావించిన నావికులకు కూడా, మనదేశపు ఉన్నత న్యాయస్థానం ముందు నిలబెట్టి కఠినంగాశిక్షించేందుకు ధైర్యం చేయని-చేయలేని దుస్థితిలో వున్నారు.

ఈ రోజున నయాఉదారవాద ప్రపంచీకరణ ప్రాణాంతక ప్రమాదకర సాంకేతికత విదేశీ పెట్టుబడులు కలసి మనదేశంపై, దేశ వనరులపై, దేశ ప్రజలపై జరుపుతున్న అఘాయిత్యాలను, దుర్మార్గాలను ప్రతిఘటించ లేకపోగా, కనీసం బలంగా నిరసననైనా వ్యక్తంచేయలేని స్థితిలో మన భారత పాలకవర్గాలు, బడా పారిశ్రామిక వర్గాలూ, పాలకులూ-ప్రభుత్వాలూ వున్నాయి.

అండర్సన్ చావు సందర్భంగా, భారత దేశప్రజలు - దేశభక్తులు పరిస్థితులను మననం చేసుకొని, తగు గుణపాఠాలు తీసుకొని, సామ్రాజ్యవాద విదేశీ దోపిడీ యొక్క ఘాతుక, దుష్టపర్యవసానాలకు వ్యతిరేకంగా ఒక బలమైన వ్యతిరేక ఉద్యమం నిర్మించాల్సిన అవసరాన్ని గుర్తించాలి.

ఇది వ్యక్తిగతంగా ఆండర్సన్‌తో-భారత ప్రజలకున్న విరోధం కాదు. అతడి చావుతో-దుష్టుడు చచ్చాడులే అని ఆనందిస్తే తీరిపోయేదీ కాదు.

'తీవ్రవాదుల'పై యుద్ధం జరపటానికి, వారు ప్రపంచంలో ఎక్కడవున్నా దాడిచేసే హక్కు తనకున్నదని గర్వంగా ప్రకటించుకొని, అక్రమ దాడులకు పాల్పడుతున్న అమెరికన్ ప్రభుత్వం, తన విషయం వచ్చేటప్పటికి తన దేశ పౌరులైన నేరస్తులను, న్యాయవిచారణకు సంబంధిత దేశాలకు అప్పజెప్ప నిరాకరించటంలోనే వుంది అమెరికన్ సామ్రాజ్యవాదపు కుటిల నీతి! సామ్రాజ్యవాదులు, తాము చట్టానికి అతీతులమన్నట్లు వ్యవహరించటంలోనే వుంది వారి దుష్టత్వం! అందుకే సామ్రాజ్యవాదం ప్రపంచ ప్రజల శత్రువు.

సామ్రాజ్యవాదమూ-పెట్టుబడిదారీ వ్యవస్థా ప్రపంచంలో మనుగడలో వున్నంతకాలం, సామ్రాజ్యవాద దుర్మార్గం-దుష్టత్వాలు సజీవంగానే కొనసాగుతాయి. ఆండర్సన్‌లు కోకొల్లలుగా పుట్టుకొస్తూనే వుంటారు.

చచ్చేదాకా చాటుమాటున దాగివుండిన ఆండర్సన్ ఉదంతం, సామ్రాజ్యవాద దుష్టత్వానికి సాక్ష్యంగా వుండి, ప్రపంచ ప్రజానీకానికి నిరంతరం ముప్పును హెచ్చరిస్తూ వుంటుంది. ✶

# శ్రీకాకుళ పోరాట తొలి అమరవీరులు కా॥ కోరన్న, మంగన్నల పోరాట వారసత్వాన్ని కొనసాగిద్దాం



పార్వతీపురంలో ప్రదర్శన; వర్ధంతిసభకు హాజరైన గిరిజన ప్రజానీకం; శ్రీకాకుళంలో అమరుల స్థూపం వద్ద సభలో ప్రసంగిస్తున్న కా॥ ఝూన్సి; (దిగువున) శ్రీకాకుళంలో అమరుల స్థూపం వద్ద నివాళులు

**పార్వతీపురం, 31-10-14 :**

శ్రీకాకుళ పోరాట తొలి అమరవీరులు కామ్రేడ్స్ కోరన్న, మంగన్నల 47వ వర్ధంతి సభ రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) విజయనగరం జిల్లా కమిటీ నాయకత్వంలో పార్వతీపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో జరిగింది. ఈ సభకు కొమరాడ, పార్వతీ పురం, కురుపాం, మక్కువ మండలాల నుండి మరియు ఒరిస్సా రాష్ట్రం చసీములియా ఆదివాసీ సంఘాల నుండి సుమారు వెయ్యిమంది హాజరయ్యారు. వర్ధంతి సభకు ముందు పార్వతీపురం పట్టణంలోని బెలగాం రైల్వేస్టేషన్ నుండి ఎర్రజెండాలు చేతపట్టుకొని, కోరన్న, మంగన్నలకు జోహార్లు తెలుపుతూ, గిరిజనుల సమస్యలపై నినదిస్తూ, డప్పుల డాన్సులతోనూ, గిరిజన సాంప్రదాయ నృత్యాలైన 'కింద్రీ' చేస్తూ ఆర్.టి.సి. కాంప్లెక్స్, సౌందర్య థియేటర్, నాలుగురోడ్ల సెంటర్, పాతబస్టాండ్ మీదుగా వ్యవసాయ మార్కెట్‌యార్డు వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన పట్టణ ప్రజలను ఆకర్షించింది. ప్రదర్శనలో ముందుభాగాన రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కా॥ సింహాద్రి ఝూన్సి, కార్మిక నాయకులు, రైతుకూలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఈ సభ రైతుకూలీసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కా॥ కద్రక వెంకటస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో మహత్తర శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటంలో భూస్వాముల, షావుకార్ల పాశవిక దాడులను ప్రతిఘటిస్తూ పోరాడి నేలకొరిగిన కా॥ ఆరిక కోరన్న, బిడ్డిక మంగన్నలకు రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) నివాళులర్పించింది.



ఈ సభకు ముఖ్యవక్తగా హాజరైన రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కా॥ సింహాద్రి ఝూన్సి మాట్లాడుతూ భూస్వాముల, షావుకార్ల, ఫారెస్టు అధికారుల దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన గిరిజనులపైన, ప్రజా నాయకులపైన ప్రభుత్వం పాశవికమైన నిర్బంధాన్ని ప్రయోగించి ఉద్యమాన్ని అణచివేసిందన్నారు. గిరిజన హక్కులను పరిరక్షిస్తానని, గిరిజన ప్రాంతాలను అభివృద్ధిచేస్తామని, గిరిజనుల భూమిసమస్యను పరిష్కరించ డానికి 1/70 చట్టం చేసి గిరిజనుల భూములు గిరిజనులకే అప్పజెపు తామని వాగ్దానాల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చిన పాలకులు ఆచరణలో గిరిజనుల యొక్క మౌలిక సమస్యలైన భూమిసమస్య, అడవి మీద హక్కు సమస్య నేటికీ పరిష్కారం చేయలేదని, గిరిజన ప్రాంతాలలో నేటికీ రహదారుల సమస్య, విద్య, వైద్యం లాంటి కనీస సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. గిరిజనులను అడవి నుండి దూరం చేయడానికి ప్రభుత్వాలు పూనుకొంటున్నాయని, దీనికి ఉదా : ఏజెన్సీలో బాక్సైట్ తవ్వకాలు, అభయారణ్యాలు పేరుతో ముందుకు వస్తున్నాయని వివరించారు. కా॥ కోరన్న, మంగన్నలు అమరత్వం పొంది 47 సంవత్సరాలు పూర్తిఅయినా, ఈనాటికీ వారి వర్ధంతి సభ అంటే దోపిడీ పాలకులకు వెన్నులో వణుకు పుడ్తోందన్నారు.

రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) జిల్లా కార్యదర్శి కా॥ డి. వర్మ మాట్లాడుతూ జిల్లాలో నేటికి 170 గిరిజన గ్రామాలు షెడ్యూల్డు ఏరియాగా ప్రకటించకుండా గిరిజన హక్కులను కాలరాస్తున్నారని, గిరిజనుల అభివృద్ధి కోసంపెట్టిన ఐటిడిఏ, జిసిసిలు పూర్తిగా విఫలమయ్యాయని పేర్కొన్నారు. ఇంకా ఈ సభలో ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥ మెరిగాని గోపాలం, రైతుకూలీసంఘం జిల్లా సహాయ కార్యదర్శులు కా॥ శ్రీను నాయుడు, ఎమ్. భాస్కర్రావు, జిల్లా అధ్యక్షుడు కా॥ ఊయక ముత్యాలు, ఉపాధ్యక్షుడు కా॥ బి. నర్సింగరావులు మాట్లాడారు.

**శ్రీకాకుళం, 31-10-14 :**

శ్రీకాకుళం పట్టణంలోని ఆముదాలవలస బైపాస్ వద్ద గల శ్రీకాకుళ పోరాట అమరవీరుల స్థూపం వద్ద శ్రీకాకుళ పోరాట తొలి అమరవీరులు కోరన్న, మంగన్నల 47వ వర్ధంతి సభ జరిగింది. ఈ సభకు ముందుగా చారిత్రక అమరుల స్థూపం వద్ద రైతుకూలీ సంఘం(ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు కా॥ సింహాద్రి ఝూన్సి పుష్పగుచ్ఛాలుంచి మహత్తర శ్రీకాకుళ పోరాటంలో అమరులైన వారందరికీ జోహార్లు చెప్పారు. తరువాత ఉపాధ్యాయ ఉద్యమ సీనియర్ నాయకులు కా॥ బి. అప్పయ్య మాష్టారు స్థూపంవద్ద ఎర్రజెండాను ఎగురవేసి జోహార్లర్పించారు.

ఈ వర్ధంతి సభకు రైతుకూలీసంఘం జిల్లా కార్యదర్శి కా॥ తాండ్ర అరుణ అధ్యక్షత వహించారు. ముందుగా అమరులకు జోహార్లర్పిస్తూ రెండు నిముషాలు మౌనం పాటించారు. సభకు ముఖ్యవక్తగా వచ్చిన రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ శ్రీకాకుళ పోరాట ఫలితంగానే ప్రభుత్వం అనేక గిరిజన చట్టాలు చేసిందని, వాటిని అమలు పర్చటంలో ప్రభుత్వాలు ఉద్దేశ్యపూర్వక ఘోర నిర్లక్ష్యంతో వ్యవహరించాయని చెప్పారు. నేటికీ గిరిజనుల యొక్క మౌలిక సమస్యలు పరిష్కారం కాలేదని, ఈనాటికీ భూమిసమస్య పరిష్కారంకాలేదని, అందుకు పోరాటమే మార్గమని చెప్పారు.

ఈ సభలో ఇంకా రైతుకూలీసంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి కా॥ డి. వర్మ, జిల్లా కార్యదర్శి కా॥ తాండ్ర అరుణ, కా॥ మట్టా వెంకటరమణ; రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షులు కా॥ బి. అచ్చయ్య, ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు ఎమ్. గోపాలం మాట్లాడారు. ప్రజాకళాకారులు విప్లవ గీతాలను పాడారు. ఈ సభకు చౌదరి సత్యన్నారాయణ కాలనీ నుండి, చుట్టుప్రక్కల గ్రామాల నుండి 400 మంది హాజరయ్యారు. ✡

# కా॥ ఘంటా సీతారామయ్యకు జోహార్లు

**గూడవల్లి, 30-10-14 :**

సీనియర్ కమ్యూనిస్టు నాయకులు కా॥ ఘంటా సీతారామయ్య రెండవ వర్ధంతి సందర్భంగా గుంటూరు జిల్లా చెరుకుపల్లి మండలం, గూడవల్లి గ్రంథాలయం సెంటర్ నుండి బస్టాండ్ వరకు సిపిఐ(ఎం.ఎల్) ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. కమ్యూనిస్టు, విప్లవోద్యమంలో అమరులైన కా॥ ఘంటా సీతారామయ్య, దొంతు నాగయ్య, పీతా వెంకటేశ్వర్లు, ముత్తిరెడ్డి వెంకటాచలం, దాసరి సుబ్బయ్యలకు జోహార్లు అర్పిస్తూ వారి ఆశయాలను తుదికంటా కొనసాగి స్తామని నినదించారు.

సిపిఐ(ఎం.ఎల్)నాయకులు కా॥ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కా॥ సీతారామయ్య సుదీర్ఘకాలం కమ్యూనిస్టు రాజకీయ జీవితాన్నిగడిపారని, గ్రామంలో సాగుదారుల, కౌలుదారుల ప్రయోజనాల కోసం పాటుపడ్డారని, అందరికి విద్యా, విజ్ఞానం అందటానికి గ్రామంలో కృషిచేశారని, ప్రజలమధ్య సామాజిక అంతరాలను, అంతస్తులను ప్రశ్నిస్తూ పీడిత, తాడిత, అణగారిన ప్రజలపక్షాన వుండి ఎర్రజెండానెత్తి అలాంటి కృషిలో ఎదురయ్యే ఆటంకాలను ఎదురొడ్డి నిలబడ్డా రన్నారు. నేడు సమాజంలో అగ్రకుల పెత్తందారుల దాడులు, మతతత్వ శక్తుల దాడులు, మరోవైపు దేశ సహజ సంపదల లూటి సాగుతున్న పరిస్థితుల్లో పాలక వర్గాలు అనుసరిస్తున్న కుటిల రాజకీయాలను అర్థం చేసుకుని, అమరుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని సమసమాజ స్థాపనకోసం పోరాట పతాకను ఎత్తిపట్ట వలసిన అవసరం ఎంతైనా వుంది అంటూ అదే కమ్యూనిస్టు అమరవీరులకు మనమిచ్చే నివాళిగా ఆయన అన్నారు.

సిపిఐ(ఎం.ఎల్) నాయకులు కా॥ దొంతు శ్రీనువాసరావు సీతారామయ్యగారి జీవిత విశేషాలను వారికి ఆయనతోవున్న అనుబంధాన్ని చెప్పి వారి ఆశయాలను మునుముందుకు తీసుకుపోతామని అన్నారు.

ఒపిడిఆర్ జిల్లా నాయకులు కా॥ కె. నాగరాజు మాట్లాడుతూ సీతారామయ్యగారు హక్కుల ఉద్యమంలో వున్నారని గ్రంథాలయోద్యమంలో పాల్గొన్నారని విశ్వాసాలు వీడని; మాటను, బాటను మార్చని; ప్రజా ఉద్యమంలో వున్నారని, వారు సాగించిన కృషిని మరింత ముందుకు తీసుకుపోవడంలో సమాజమార్పు కోసం, దోపిడీలేని వ్యవస్థ కోసం ఉద్యమించుదాం అన్నారు.

ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥జగ్గారపు సుబ్బారావు, మర్రివాడ వెంకట్రావ్, కా॥అంజిరెడ్డి మాట్లాడారు, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) నాయకులు డి.భాస్కర్, ఎన్‌వైఎస్ జిల్లా నాయకులు దండా ప్రసాద్, ఎం. రాజేశ్వరి, ఎద్దు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమం తదనంతరం సీతారామయ్యగారి కూతురు ప్రభావతీ ఇంటివద్ద సీతారామయ్యగారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. వారి మనుమలు రమేష్, మనుమరాలు విజయ, గ్రామప్రజలు వారి సహస్నేహితులు రావిపాటి సుబ్బారావు, సత్యం, ఎ.రామకృష్ణయ్య, ఎం. రామకృష్ణ, సిపిఐ(ఎం.ఎల్) నాయకులు జోహార్లు అర్పించారు. ✡

# రైతుల రుణమాఫీ అమలుకై ప్రదర్శన - ధర్నా

**ఒంగోలు, 22-9-2014**

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) ప్రకాశంజిల్లాశాఖ ఆధ్వర్యంలో రైతుల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని, కౌలురైతులకు గుర్తింపు కార్డులు, రుణ సదుపాయం కల్పించాలనీ, కోల్డ్‌స్టోరేజిలలో వున్న శనగలకు గిట్టుబాటు ధర కల్పించి వెంటనే కొనుగోలు చేయాలని నినదిస్తూ ఒంగోలు పట్టణం ఈమనిపాలెం జిల్లా కార్యాలయం నుండి పోస్టాఫీస్, చర్చి, నెల్లూరు బస్టాండ్, ఎల్ఐసి ఆఫీస్ సెంటర్ల మీదుగా ప్రకాశం భవనం వరకు ప్రదర్శన సాగింది.

రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా అధ్యక్షులు కా॥వేజెండ్ల రామారావు అధ్యక్షతన కలక్టరేట్‌వద్ద ధర్నా కార్యక్రమము నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర నాయకులు కా॥డివిఎన్ స్వామి మాట్లాడుతూ దేశానికి 'స్వతంత్రం' వచ్చిన ఈ 67 సంవత్సరాలలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏవీ కల్పించబడలేదని, పాలకులు దేశానికి అవసరమైన వ్యవసాయ విధానాన్ని రూపొందించలేదని, ఫలితంగా రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలకు పాల్పడు తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మరోవైపు ప్రజలకు అవసరమైన, వ్యవసాయ ఉత్పత్తుల ఆధారిత పరిశ్రమలను స్థాపించకుండా పరిశ్రమాధిపతులకు లాభాలు కల్పించే విలాస వస్తువుల పరిశ్రమలను స్థాపించుతూ, ప్రభుత్వ అధీనంలోని పరిశ్రమలను మూసివేస్తూ కార్మికులను వీధులపాలు చేస్తూ నిరుద్యోగాన్ని పెంచుతున్నారని, దేశంలోని కీలకరంగాలైన రైల్వే, రక్షణ మరియు రిటైల్ వ్యాపారంలో సహితం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్ని ఆహ్వానించి దేశసంపదను సామ్రాజ్యవాదులకు ధారాదత్తం చేస్తున్నారని, ఈ విధానాలకు వ్యతిరేకంగా రైతాంగం, రైతుకూలీలు కార్మికవర్గంతో కలిసి వ్యవస్థ మార్పు కోసం సంఘటితంగా ఉద్యమించటమే పరిష్కారమన్నారు.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర) జిల్లా కార్యదర్శి కా॥ఎస్. లలితకుమారి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలుచేయ కుండా, ప్రజలను బుజ్జగిస్తూ బహుళజాతి పారిశ్రామిక శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తు న్నాడని, పెన్షన్ వంటి సంక్షేమ పథకాల పేరుతో కీలకమైన భూమి సమస్య నుండి ప్రజలను పక్కదారి పట్టించి నిత్యం పాలకులపై ఆధారపడే మనస్తత్వాన్ని పెంచుతున్నాడని, వీటికి వ్యతిరేకంగా రైతాంగం సంఘటితంగా రుణాల మాఫీకొరకు, కౌలురైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు, రుణసౌకర్యం, నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు, గిట్టుబాటు ధరకోసం పోరాడాలన్నారు. ఇంకా ఈ ధర్నాలో ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కా॥ ఎం. ఎస్. శాయి తదితరులు ప్రసంగించారు.

ధర్నా అనంతరం జిల్లా కలెక్టరుకు సంఘం జిల్లా నాయకులు కా॥పి.కోటేశ్వరరావు, కా॥వి.శ్రీరాములు, కా॥కె. కోటేశ్వరరావు, కా॥ఎం.శ్రీను, కా॥వెంకటరావు తదితరులతో కలిసి మెమోరాండం అందజేశారు. ✡

Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010